thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 190 | జగిత్యాల మంగళవారం 20 అక్టోబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |




చురకలు పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులు, మిత్రులకు దసరా శుభాకాంక్షలు..

దసరా రోజు మంగళవారం మా కార్యాలయానికి సెలవు. బుధవారం పత్రిక వెలువడదు. పునర్దర్శనం గురువారం.

- ఎడిటర్



## సీజేపీ నేతలకు మరో రెండు రోజుల కస్టడీ!

అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌ల నిర్బంధం అక్టోబర్ 21 వరకు పొడిగింపు

4

ఐదు రోజులు కోరిన ఢిల్లీ పోలీసులు.. రెండురోజులకే అనుమతి

## ఫేక్ కంటెంట్‌పై నిఘా పెట్టండి!

సోషల్ మీడియా సంస్థ 'మెటా'కు కేంద్రం కీలక ఆదేశాలు

- ఫేస్‌బుక్, ఇన్‌స్టా అల్గారిథమ్‌లను సమీక్షించుకోవాలని సూచన
- పాత వీడియోలు, ఎడిట్ చేసిన దృశ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

వివరాలు 3లో..






## కరవు కట్టడికి సబ్ కమిటీ

భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఐదుగురు మంత్రులతో ఏర్పాటు

తాగు, సాగునీరు, విద్యుత్, కొరత నివారణపై ఫోకస్

11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టంపై సర్కార్ ఆందోళన

2





## అంతర్జాతీయ స్థాయిలో

# గ్లోబల్ సమ్మిట్

### డిసెంబర్ 7 నుంచి 9 వరకు 'ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు'

- నవంబర్ నెలాఖరుకల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలన్న సీఎం రేవంత్
- స్కిల్స్ యూనివర్సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ - 2026' ఏర్పాట్లను అంతర్జాతీయ స్థాయిలో చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశ, విదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునేలా ఆ స్థాయిలో సన్నాహాలు ఉండాలన్నారు. ఫ్యూచర్ సిటీలో సోమవారం పర్యటించిన ఆయన.. సదస్సుకు వేదికగా నిలవనున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 'మీ పెట్టుబడులకు మాది భరోసా' అనే ప్రధాన థీమ్‌తో స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచుకుని, నిర్దేశిత మిగతా 2 లో

## ఫార్మా ల్యాబ్‌ల్లో డ్రగ్స్!

### నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చిన ముఠా




- కొండమడుగు, మౌలాలీల్లో మత్తు పదార్థాల తయారీ
- ముఠా గుట్టురట్టు చేసిన ఈగల్ ఫోర్స్, ఎన్సీబీ
- బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయంపై దర్యాప్తు

2



## ఎల్‌నినోపై ముందస్తు అలర్ట్!

కిందిస్థాయి వరకు యాక్షన్ ప్లాన్ ఉండాలన్న సీఎస్ సంజయ్ జాజు

2



02

- ఖర్చులో వెనుకబడిన శాఖలతో ప్రత్యేక మీటింగ్ పెట్టాలి
- ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి

## సబ్‌ప్లాన్ నిధుల ఖర్చు పెంచండి!

ఎస్సీ, ఎస్టీ నిధుల వాడకం వేగవంతం చేయాలి



## కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!

3



## కృష్ణా, గోదావరి జలాలను వాడుకుంటే ఈ కరువుండేదా?

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించిన కల్వకుంట్ల కవిత

3

# మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ






4

- సంగీత కార్యక్రమంపై రాళ్ల దాడి.. కాల్పుల్లో యువకుడి మృతి
- వంటచెరుకు కోసం వెళ్లిన వారిపై సాయుధుల కాల్పులు.. ముగ్గురు దుర్మరణం
- మృతదేహాలతో ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఆందోళన



## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం!

- పారదర్శక రెవెన్యూ సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- 34 నెలల్లో 12.40 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ

వివరాలు 2వ పేజీలో



# సబ్‌ప్లాన్ ఖర్చు పెంచండి!

**ఎస్సీ, ఎస్టీ నిధుల వాడకం వేగవంతం చేయాలి**

**ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి**

**ఖర్చులో వెనుకబడిన శాఖలతో ప్రత్యేక మీటింగ్ పెట్టాలి**

**ఆదాయం పెంపు, రుణాల పునర్వ్యవస్థీకరణపై కసరత్తు**

**మెరుగైన ఆర్థిక నిర్వహణకు నిపుణుల సలహాలు తీసుకోండి**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించేలా వేగం పెంచాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం ఆర్థిక శాఖ ఉన్నతాధికారులతో ఆయన విస్తృతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు, శాఖల వారీగా కేటాయింపులు, ఇప్పటివరకు జరిగిన వ్యయంపై ఆరా తీశారు. నిధులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఖర్చయ్యేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని, నిధుల వాడకంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. సాధారణ పద్దుల తరహాలోనే ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక పద్దుల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. నిధుల వినియోగంలో బాగా వెనుకబడిన వ్యవసాయం, వైద్యం, ఇంధనం, పురపాలక, పంచాయతీరాజ్, సాంఘిక, గిరిజన సంక్షేమం, పరిశ్రమల శాఖల కార్యదర్శులతో త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మిగిలిన నిధుల వినియోగానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలన్నారు.

**ఆదాయ మార్గాలపై అన్వేషణ..**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేసేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు.. కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని భట్టి దిశానిర్దేశం చేశారు. బడ్జెట్ రూపకల్పనలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటూ.. ఆర్థిక శాఖలో సంస్కరణలు, రుణాల పునర్వ్యవస్థీకరణపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. మెరుగైన ఆర్థిక నిర్వహణ కోసం అనుభవజ్ఞులైన కన్సల్టెంట్లు, నిపుణుల సేవలను వాడుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఫైనాన్స్, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, స్పెషల్ సెక్రటరీ సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై ముందస్తు అలర్ట్!

**కిందిస్థాయి వరకు యాక్షన్ ప్లాన్ ఉండాలన్న సీఎస్ సంజయ్ జాజు**

**పరిశ్రమలకు పవర్ కట్ లేదు.. ఆందోళన వద్దు**

**ప్రభుత్వ ఆఫీసుల్లో కరెంట్ ఆదా.. ఏసీల వాడకంపై ఆంక్షలు**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ కొరత తలెత్తకుండా జిల్లా, మండల స్థాయిలో పక్కా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలకు ప్రత్యేకంగా నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ.. వ్యవసాయ, గృహ, పారిశ్రామిక అవసరాలకు ఎలాంటి కోతలు విధించడం లేదని, పరిశ్రమల యాజమాన్యాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎస్ స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చర్యలు పాటించాలని, పగటిపూట ఏసీలను 25 డిగ్రీల వద్దే ఉంచాలని, సాయంత్రం 6 గంటల తర్వాత వాడకం పూర్తిగా ఆపేయాలని ఆదేశించారు. అన్ని థర్మల్ కేంద్రాల్లో గరిష్ట స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ ప్లాంట్‌పై ఐదుగురు ప్రత్యేక అధికారులు ఫోకస్ పెట్టాలని సూచించారు. కరెంట్ లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నందున వ్యవసాయానికి అక్రమ మోటార్ల వాడకాన్ని అరికట్టాలన్నారు. ఎల్‌నినో పరిస్థితిపై త్వరలో అఖిలపక్ష సమావేశంతో పాటు కేబినెట్ సబ్ కమిటీ భేటీ ఉంటుందని సీఎస్ వెల్లడించారు.

**కొత్త బోరుబావులకు నో పర్మిషన్!**

హైదరాబాద్ మహానగరంలో తాగునీటికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. నిర్మాణ పనులకు కొత్తగా బోరుబావుల తవ్వకాలను అనుమతించబోమని, తాగునీటి కోసం ఉన్న బోరుబావులను మరింత లోతు చేసుకునేందుకు మాత్రమే పర్మిషన్ ఇస్తామని స్పష్టం చేశారు. నల్లాలకు మోటార్లు బిగించి అక్రమంగా నీటిని తోడేవారిపై హైడ్రా తదితర ఏజెన్సీల సాయంతో స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు చెప్పారు. నవంబర్ 1 నుంచి నగరంలో నిర్మాణ పనులకు ఎస్టీపీల (ట్రీట్‌మెంట్) ద్వారా వచ్చే నీటిని గ్రీన్ ట్యాంకర్లతో సరఫరా చేస్తామన్నారు. మంజీరా, సింగూరు ద్వారా 110 ఎంజీడీల నీటి సరఫరా లేనందున.. ఆ లోటును మిషన్ భగీరథ ద్వారా 60 ఎంజీడీలు, మిగతావి కృష్ణా, ఇతర వనరుల ద్వారా భర్తీ చేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**పాలేరులో 2 టీఎంసీల లోటు..**

జిల్లాల పరిస్థితులపై ప్రత్యేక అధికారులు సీఎస్‌కు నివేదించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు పడిపోతున్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని వికాస్ రాజ్, నల్గొండలో ఉపాధి పనులు ముమ్మరం చేశామని హరిచందన తెలిపారు. కరీంనగర్‌లో జూన్ వరకు తాగునీటి సమస్య లేదని బీడీ ఎక్కా, ఆదిలాబాద్‌లో పశుగ్రాసం కొరత రాకుండా ప్లాన్ చేస్తున్నామని ఇలంబర్తి వివరించారు. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు జూన్ వరకు తాగునీరు అందాలంటే పాలేరు రిజర్వాయర్‌లో 4 టీఎంసీలు అవసరమని, ప్రస్తుతం 2 టీఎంసీలే ఉన్నాయని ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ సమీక్షలో ఉన్నతాధికారులు నవీన్ మిత్తల్, సురేంద్ర మోహన్, టీకే శ్రీదేవి, ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు వరుణ్ రెడ్డి, జితేష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ సమ్మిట్!

(మొదటి పేజీ తరువాయి..)

గడువుకు 15 రోజుల ముందుగానే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. నవంబర్ నెలాఖరు నాటికి గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ కేవలం ఒక వ్యాపార సదస్సు మాత్రమే కాదని, తెలంగాణ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే చారిత్రక వేదికగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఏర్పాట్లపై ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని, పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**కమిషనరేట్ ప్రారంభం.. ఎన్ఐయూఎంకు శంకుస్థాపన**

భారత్ ఫ్యూచర్ సిటీని సందర్శించడానికి ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇబ్రహీంపట్నంలో నూతనంగా నిర్మించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. భవనంలోని కమిషనర్ కార్యాలయాన్ని ప్రారంభించి, నూతన సీపీ తరుణ్ జోషికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎఫ్‌సీడీఏ కార్యాలయ ఆవరణలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్మెంట్ (ఎన్ఐయూఎం) నూతన భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన క్యాంపస్ నమూనాను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో డీజీపీ సీవీ ఆనంద్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్యతో పాటు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# దసరా.. ధర్మ విజయానికి ప్రతీక!

**రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరా పండుగకు ప్రత్యేక స్థానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం లాంటి గొప్ప విలువలను బోధిస్తుందని చెప్పారు. మనలోని అహంకారం, అసూయ, ద్వేషం వంటి చెడు లక్షణాలను విడనాడి.. ప్రేమ, కరుణ, మానవత్వంతో కూడిన సమాజ



నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాలు పూయించాలని, అందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి అమ్మవారు, రావణాసురుడిని మట్టుబెట్టి శ్రీరాముడు సాధించిన విజయాన్ని ఈ పర్వదినం గుర్తు చేస్తుందన్నారు. జమ్మి చెట్టుకు పూజలు చేసి, ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకోవడం తెలంగాణలో ప్రత్యేక సంప్రదాయమని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించడాన్ని, పెద్దలను గౌరవించడాన్ని చాటిచెబుతుందని ఆయన వివరించారు.

# కరవు కట్టడికి సబ్‌కమిటీ!

**భట్టి విక్రమార్క చైర్మన్‌గా ఐదుగురు మంత్రులతో ఏర్పాటు**

**తాగు, సాగునీరు, విద్యుత్, పశుగ్రాసం కొరత నివారణపై ఫోకస్**

**11.18 లక్షల ఎకరాల్లో పంట నష్టంపై సర్కార్ ఆందోళన**

**కేంద్రానికి రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోసం విజ్ఞప్తి**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి సభ్యులుగా వ్యవహరించనున్నారు. సీఎం సలహాదారు రామకృష్ణారావు ప్రత్యేక ఆహ్వానితుడిగా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

**నష్టంపై అంచనాలు.. కొరతలపై నజర్**

రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదు కావడంతో సుమారు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు 11.18 లక్షల ఎకరాల్లో పంటలు చేతికందే పరిస్థితి లేదని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తాగు, సాగునీరు, విద్యుత్ సరఫరా, పశుగ్రాసం కొరత తలెత్తకుండా సబ్‌కమిటీ నిరంతరం పర్యవేక్షించనుంది. రిజర్వాయర్ల నిర్వహణతో పాటు నష్ట నివారణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనుంది. కరవును దీటుగా ఎదుర్కొనేందుకు వీలైన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ శాసనసభలో తీర్మానం చేసి ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి విజ్ఞప్తి



చేసింది. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కేటాయించాలని కోరింది. కేంద్ర సహకారం రాబట్టే అంశంపైనా భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఈ సబ్‌కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది.

# భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం!

**పారదర్శక రెవెన్యూ సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్ (చురకలు):** ప్రజలకు పారదర్శకమైన రెవెన్యూ సేవలు, రైతులకు చట్టబద్ధమైన భూ హక్కులు కల్పించి, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, స్వార్థపూరిత నిర్ణయాల వల్లే పదేళ్లలో రెవెన్యూ వ్యవస్థ అస్తవ్యస్తమైందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో ఈ వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. భూభారతి చట్టం అమలు, పాస్‌పుస్తకాల పంపిణీ, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన భూముల రీ-సర్వే తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందేలా పక్కాగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు 'భూభారతి' చట్టంలో పేర్కొన్న విధంగా రీ-సర్వే చేసి శాశ్వత పరిష్కారం చూపుతున్నామని మంత్రి తెలిపారు. ఈ చట్టం అమలులోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటి వరకు 5,68,858 పాస్‌పుస్తకాలు జారీ చేశామని, అంతకుముందు ఇచ్చిన వాటితో కలిపి మొత్తం 34 నెలల వ్యవధిలో 12,40,366 పాస్‌పుస్తకాలను రైతులకు అందజేశామని వెల్లడించారు. దశాబ్దాలుగా భూమిని సాగు చేసుకుంటున్నా రికార్డుల్లో హక్కులు లేని వాస్తవ సాగుదారులకు ఈ సర్వే ద్వారా న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో రీ-సర్వే నిర్వహించి 906 మంది గిరిజన, గిరిజనేతర రైతులకు 1,600 ఎకరాలకు పైగా భూమిపై హక్కులు కల్పించామన్నారు. సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 15 గ్రామాల్లో 2,400 మంది రైతులకు 3,450 ఎకరాలకు పట్టాలు ఇచ్చామని వివరించారు. దీనివల్ల సదరు రైతులకు బ్యాంకు రుణాలు, రైతుభరోసాతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు సులువుగా అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.



**వేగంగా రీ-సర్వే పనులు..**

ములుగు జిల్లా ముల్కపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, దమ్మపేట, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలాల్లో రీ-సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అక్కడ కూడా హక్కుదారులకు పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. ఇదే విధానాన్ని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసి, ప్రభుత్వ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. అలాగే, జనగామ జిల్లాలో ఫుడ్ పార్క్ ఏర్పాటుపై ఆ జిల్లా కలెక్టర్‌తో మంత్రి చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ డీఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు.




# ఫార్మా ల్యాబ్‌ల్లో డ్రగ్స్!

**నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చిన ముఠా**

**కొండమడుగు, మౌలాలీల్లో మత్తు పదార్థాల తయారీ**

**ముఠా గుట్టురట్టు చేసిన ఈగల్ ఫోర్స్, ఎన్సీబీ**

**బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయంపై దర్యాప్తు**

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** ఫార్మా పరిశ్రమల ముసుగులో భారీగా సాగుతున్న మాదకద్రవ్యాల తయారీ వ్యవహారాన్ని 'ఈగల్ ఫోర్స్' రట్టు చేసింది. ఆల్ప్రాజోలం, ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్ లాంటి మత్తు పదార్థాలను తయారు చేస్తూ నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ శివార్ల వరకు విస్తరించిన ఓ అంతర్రాష్ట్ర ముఠా కార్యకలాపాలను అధికారులు పసిగట్టారు. నాగ్‌పూర్‌లో పోలీసుల దాడుల నేపథ్యంలో ఈ ముఠా సూత్రధారి చేతన్ మేశ్రామ్ అస్సాంకు చెందిన ఆయూబ్ సాయంతో హైదరాబాద్‌కు మకాం మార్చాడు. వీరు కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్ యజమాని రామరాజు నుంచి రియాక్టర్‌ను లీజుకు తీసుకుని డ్రగ్స్ తయారు చేశారు. గుజరాత్‌లోని వల్సాద్ నుంచి హైడ్రోక్లోరిక్ యాసిడ్ పేరుతో గుట్టుచప్పుడు కాకుండా రసాయనాలు రప్పించి 25 కిలోల మెఫెడ్రోన్ తయారు చేయగా.. దాన్ని బీబీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో ఈ దందా బయటపడింది. అయినప్పటికీ ఈ ముఠా మౌలాలీలోని ఎస్ఎం ల్యాబ్స్ యజమాని మాణిక్ రెడ్డి నుంచి మరో రియాక్టర్‌ను లీజుకు తీసుకుని డ్రగ్స్ తయారీ కొనసాగించింది. పక్కా సమాచారంతో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) అధికారులు ఎస్ఎం ల్యాబ్స్‌పై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. రసాయనాలు సరఫరా చేశారన్న అనుమానంతో ముంబైకి చెందిన జేఎస్వీ గ్లోబల్స్ యజమాని జైరాజ్ కృష్ణ శెట్టిని సైతం ఈగల్ ఫోర్స్ అదుపులోకి తీసుకుంది. డ్రగ్స్ తయారీ కేంద్రాల్లో పనిచేసేందుకు ఆయూబ్ అస్సాం నుంచి తీసుకొచ్చిన కార్మికుల్లో కొందరు అక్రమ బంగ్లాదేశ్ వలసదారులు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ దందా వెనుక ఇతర రాష్ట్రాలు, విదేశీ ముఠాల ప్రమేయంపైనా దర్యాప్తు సంస్థలు ఆరా తీస్తున్నాయి.

# కృష్ణా, గోదావరి జలాలను వాడుకుంటే ఈ కరువుండేదా?

- కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించిన కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గోదావరి, కృష్ణా నదుల నీటిని సరిగా వాడుకుంటే మనకు ఈ పరిస్థితే వచ్చేది కాదని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సోమవారం ఆమె కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రాణహిత ప్రవాహాన్ని పరిశీలించారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసిందే నీళ్ల కోసమని, కానీ రాష్ట్రం వచ్చాక వాటిని సంపూర్ణంగా వాడుకోలేకపోయాని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కృష్ణా ప్రాజెక్టుల ద్వారా 4 నుంచి 5 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చారని, ఎస్సారెస్పీ, కడెం, అప్పర్, మిడ్, లోయర్ మానేరు ప్రాజెక్టుల ద్వారా రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసి 37 లక్షల ఎకరాలను కేవలం స్థిరీకరణ మాత్రమే చేశారని ఆమె వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం దాదాపు రూ.93 వేల కోట్లు ఖర్చు చేసి.. కొత్తగా కేవలం లక్ష ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారని, కాలువలు తవ్వకపోవడంతో 19 లక్షల ఎకరాలకు నీరివ్వడం సాధ్యం కాలేదన్నారు. ఆ కాలువలు పూర్తి చేయాలంటే మరో రూ.50 వేల కోట్లు అవసరమన్నారు. అయితే ఈ వాస్తవాలు చెబితే బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తమపై దాడి చేస్తున్నారని, కానీ వాస్తవాలు ఎప్పుడూ కఠినంగానే ఉంటాయని ఆమె వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్ వచ్చాక పరిస్థితి మరింత ఘోరం..

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని కవిత విమర్శించారు. ప్రభుత్వం రూ.26 వేల కోట్లు ఖర్చు చేసినా కొత్తగా ఒక్క ఎకరానికీ నీళ్లివ్వలేదని మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, దళితబంధు లాంటి పథకాల బకాయిలు చెల్లించకుండా కాంట్రాక్టర్ల బిల్లులు మాత్రమే ఎందుకు చెల్లిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఉన్న సంఘాల్లో ముఖ్యమంత్రి రాజకీయాలు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కరెంట్, నీళ్లు ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నా ఇవ్వకపోతే కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు.

### రానున్న పది నెలలు భయంకరమే..

రాష్ట్రంలోని ఎల్లంపల్లి సహా అన్ని ప్రధాన రిజర్వాయర్లలో నీళ్లు అడుగంటాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 21 వేల చెరువులు ఎండిపోవడంతో ముదిరాజ్, బెస్త వర్గాలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. ఒక్కసారి కరువు వస్తే చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని, రానున్న పది నెలలు మనం భయంకరమైన పరిస్థితులు చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతాంగానికి నీళ్లు ఎలా ఇవ్వొచ్చో మార్గదర్శనం చేసేందుకే తాము ఇక్కడికి వచ్చామన్నారు. తామిచ్చిన సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని లోపాలుంటే ఇంజనీర్లతో సరిదిద్దుకోవాలని సూచించారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ పనిచేయకపోతే.. తమ ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా ఈ ప్రతిపాదనలను పూర్తి చేస్తామని కవిత స్పష్టం చేశారు.

# ఫేక్ కంటెంట్‌పై నిఘా పెట్టండి!

- సోషల్ మీడియా సంస్థ 'మెటా'కు కేంద్రం కీలక ఆదేశాలు
- ఫేస్‌బుక్, ఇన్‌స్టా అల్గారిథమ్‌లను సమీక్షించుకోవాలని సూచన
- పాత వీడియోలు, ఎడిట్ చేసిన దృశ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (చురకలు):** సోషల్ మీడియాలో విద్వేషాలు, తప్పుడు ప్రచారాల వ్యాప్తిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తప్పుదారి పట్టించే కంటెంట్‌కు అడ్డుకట్ట వేసేలా అల్గారిథమ్‌ల పనితీరును సమీక్షించుకోవాలని మాతృసంస్థ 'మెటా'కు కేంద్ర ఐటీ శాఖ (మెయిటీ) సూచించింది. పాతవి లేదా ఎడిట్ చేసిన ఫొటోలు, వీడియోలను ప్రస్తుత ఘటనలుగా వైరల్ చేస్తూ ఉద్రిక్తతలు సృష్టిస్తున్న నేపథ్యంలో.. సదరు ఆడియో, వీడియోల ప్రామాణికతతో పాటు వాటి అసలు తేదీ, ప్రదేశం వివరాలను స్పష్టంగా జతచేయాలని ఆదేశించింది. ఐటీ నిబంధనలు–2021 ప్రకారం అనుమానాస్పద కంటెంట్‌ను వేగంగా గుర్తించి సంబంధిత ప్రభుత్వ సంస్థలకు నివేదించాలని అడ్వైజరీ జారీ చేసింది. అయితే, కేంద్రం జారీ చేసిన ఈ అడ్వైజరీ పరోక్ష సెన్సార్‌షిప్‌కు దారితీస్తుందని డిజిటల్ హక్కుల సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. వెంటనే ఈ సూచనలను ఉపసంహరించుకోవాలని, తొలగించిన కంటెంట్ వివరాలను మెటా పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నాయి








# కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ నోటీసులు!

### పీసీసీ చీఫ్, మంత్రి, ఎంపీకి జారీ
### ఫామ్‌హౌస్‌కు నీళ్ల మళ్లింపు ఆరోపణలపై యాక్షన్
### పోస్టులు వెంటనే తొలగించాలని డిమాండ్
### లేదంటే పరువునష్టం దావా వేస్తామని వార్నింగ్

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ ముగ్గురు కాంగ్రెస్ కీలక నేతలకు బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. కొండపోచమ్మ సాగర్ నీటిని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణలకు ఈ లీగల్ నోటీసులు పంపింది. బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్ కుమార్ ఈ మేరకు చర్యలు చేపట్టారు. కేసీఆర్‌పై అసత్య ఆరోపణలతో సోషల్ మీడియా ఖాతాల్లో చేసిన పోస్టులను తక్షణమే, బేషరతుగా తొలగించాలని లీగల్ సెల్ డిమాండ్ చేసింది. తాము చేసిన తప్పుడు ప్రచారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టం చేసింది. ఇదే అంశంపై తప్పుడు వార్తలు రాసిన ఓ దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు కూడా ఇప్పటికే బీఆర్ఎస్ లీగల్ సెల్ నోటీసులు జారీ చేసింది. పత్రికలో వచ్చిన వార్తనే ఈ ముగ్గురు నేతలు ప్రచారం చేస్తూ కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడింది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి ఆధారాలు లేకుండా నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తే ఎంతమాత్రం సహించేది లేదని బీఆర్ఎస్ హెచ్చరించింది. లీగల్ సెల్ పంపిన నోటీసులకు సకాలంలో స్పందించి తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోని పక్షంలో.. సదరు నేతలపై పరువు నష్టం దావాతో పాటు, వర్తించే ఇతర చట్టాల కింద తదుపరి న్యాయపరమైన కఠిన చర్యలు చేపడతామని తీవ్ర స్థాయిలో హెచ్చరించింది.

# అధర్మంపై ధర్మ విజయమే దసరా!

### రాష్ట్ర ప్రజలకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** చెడుపై మంచి, అధర్మంపై ధర్మం, అసత్యంపై సత్యం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. పండుగ సందర్భంగా ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడు రావణాసురుడిని, దుర్గామాత మహిషాసురుడిని సంహరించిన ఘట్టాలు.. అధర్మం ఎంత విర్రవీగినా చివరకు ధర్మమే గెలుస్తుందనే ధైర్యాన్నిస్తాయని వివరించారు. నవరాత్రులు, బతుకమ్మ ద్వారా మహిళలను, ప్రకృతిని గౌరవించుకోవడం సనాతన ధర్మానికే సొంతమన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వికసిత భారత నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆ జగన్మాత మరింత శక్తినివ్వాలని, ఆయనకు సంపూర్ణ ఆశీర్వాదాలు అందించాలని కిషన్‌రెడ్డి ప్రార్థించారు. ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరియాలని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వికసిత భారత నిర్మాణంలో అందరూ భాగస్వామ్యులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఆసుపత్రి నుంచి అద్వానీ డిశ్చార్జ్!

### ఛాతీ ఇన్ఫెక్షన్ తగ్గడంతో ఇంటికి.. అక్టోబర్ 16న అపోలోలో చేరిక

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (చురకలు):** బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్ కే అద్వానీ (98) పూర్తిగా కోలుకున్నారు. ఛాతీలో ఇన్ఫెక్షన్ కారణంగా అక్టోబర్ 16న న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రిలో చేరిన ఆయన సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. సీనియర్ న్యూరాలజీ వైద్యుడు వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స తీసుకున్న ఆయన ఆరోగ్యం మెరుగుపడటంతో వైద్యులు ఇంటికి పంపించారు. అద్వానీ గతంలో వాజ్‌పేయి ప్రభుత్వంలో కేంద్ర హోంమంత్రిగా, ఉప ప్రధానిగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

# నిందితులను వదిలిపెట్టం!

### టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనపై సీఎం ఫడ్నవీస్ ఫైర్
### దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేస్తామని ప్రకటన
### కేంద్ర సహకారంతో దర్యాప్తు వేగవంతం

**ముంబై, అక్టోబర్ 19 (చురకలు):** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై జరిగిన కాల్పుల ఘటనను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తీవ్రంగా ఖండించారు. ఫుట్‌బాల్ ఆడి వస్తుండగా ఆదివారం సాయంత్రం టైగర్ ష్రాఫ్, ఆయన డ్రైవర్‌పై దుండగులు కాల్పులు జరపగా నటుడికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై సీఎం సీరియస్‌గా స్పందించారు. నిందితులను, వారి వెనుక ఉన్న సూత్రధారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కేసును ముంబై పోలీసులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిందితులు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో తలదాచుకున్నా పట్టుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఫడ్నవీస్ భరోసా ఇచ్చారు.

# చివరి అర్హుడికీ ఇందిరమ్మ ఇల్లు!

### కూసుమంచిలో రెండో విడత మంజూరు పత్రాల పంపిణీ
### పేదరికమే ప్రామాణికంగా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
### అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్న మంత్రి పొంగులేటి

**ఖమ్మం, అక్టోబర్ 19 (చురకలు):** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి క్యాంపు కార్యాలయంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చివరి అర్హుడైన లబ్ధిదారుడికి న్యాయం జరిగే వరకు ఈ పథకం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లతో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం సైతం చేపట్టామని మంత్రి వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 2.40 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఇళ్ల ఎంపికలో ఎలాంటి రాజకీయ పక్షపాతానికి తావులేకుండా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లోనూ పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.




# మహిళా కోటాపై కాంగ్రెస్‌కు కౌంటర్!

### ఖర్గేకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు లేఖాస్త్రం
### అఖిలపక్ష భేటీ డిమాండ్‌పై తీవ్ర అభ్యంతరం
### రాహుల్, ఖర్గేలతో ఇప్పటికే చర్చించామన్న కేంద్రం
### పునర్విభజనతోనే రిజర్వేషన్ల అమలుపై పట్టు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 19 (చురకలు):** మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశాలపై కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. ఈ అంశాలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌ను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు సోమవారం ఆయన ఓ లేఖ రాశారు. ఈ విషయమై చర్చించేందుకు మార్చి, ఏప్రిల్ నెలల్లో ఖర్గేకు మూడుసార్లు లేఖలు రాయడంతో పాటు వ్యక్తిగతంగా చర్చించినట్లు రిజిజు గుర్తుచేశారు. వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోనూ భేటీ అయ్యామని, అయినా కాంగ్రెస్ నుంచి చర్చలకు ఎలాంటి తేదీలు ఖరారు కాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ స్పందించకపోవడంతో డీలిమిటేషన్ ప్రతిపాదనలపై ఏకాభిప్రాయం కోసం డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్, ఎన్సీపీ, శివసేన (యూబీటీ), ఎంఐఎం, బిజూ జనతాదళ్ తదితర పార్టీలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపినట్లు రిజిజు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మళ్లీ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇక పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రోరోగ్ చేయకపోవడంపై ఖర్గే వ్యక్తం చేసిన అభ్యంతరాన్ని కూడా మంత్రి తోసిపుచ్చారు. సభ నిరవధిక వాయిదా తర్వాత ప్రోరోగ్ చేయడానికి రాజ్యాంగంలో ఎలాంటి నిర్దిష్ట గడువూ లేదని స్పష్టం చేశారు. లోక్‌సభ స్థానాలను ప్రస్తుత 543 నుంచి 850 వరకు పెంచాలని ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిపాదిస్తోంది. జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి.. ఆ తర్వాతే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కేంద్రం ఆలోచన. అయితే ప్రస్తుత 543 స్థానాల్లోనే వెంటనే కోటాను అమలు చేయాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి డిమాండ్ చేస్తోంది. రిజర్వేషన్లకు పునర్విభజనను ముడిపెట్టడాన్ని విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. దీంతో ఈ కీలక చట్టం అమలుపై రాజకీయ ప్రతిష్ఠంభన కొనసాగుతోంది.

# ధర్మానిదే అంతిమ విజయం!

### రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దసరా శుభాకాంక్షలు
### ఎన్ని కష్టాలొచ్చినా గెలుపు సత్యానిదేనని వ్యాఖ్య
### తెలంగాణ సంస్కృతికి జమ్మి, పాలపిట్ట ప్రతీకలని వెల్లడి
### ప్రజలంతా అధర్మంపై విజయం సాధిస్తారని ధీమా

**హైదరాబాద్, అక్టోబర్ 19 (చురకలు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరా పండుగకు విశిష్ట స్థానం ఉందని బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఈ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విజయానికి సంకేతంగా జమ్మి వృక్షానికి పూజలు చేయడం, పాలపిట్టను దర్శించుకోవడం, జమ్మి ఆకును బంగారంగా భావించి పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం, అలయ్ బలయ్ ద్వారా ప్రేమాభిమానాలు చాటుకోవడం తెలంగాణ గొప్ప సంప్రదాయాలని గుర్తుచేశారు. ఈ ప్రాముఖ్యతను గౌరవిస్తూనే గత బీఆర్ఎస్ ప్రభుత్వం జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా ప్రకటించిందని తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా అంతిమంగా ధర్మానిదే విజయమనే దసరా స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన, పదేళ్ల ప్రగతి ప్రస్థానం కొనసాగాయన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలు ఇదే స్ఫూర్తితో కొనసాగుతున్న అధర్మంపై కచ్చితంగా విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కష్టాలన్నీ తొలగిపోయి తెలంగాణ ప్రజా జీవితాల్లో దసరా సుఖసంతోషాలు తీసుకురావాలని కేసీఆర్ ఆకాంక్షించారు.



## సంపాదకీయం



# జర్నలిస్టుకు రక్షణేది?

## ప్రశ్నిస్తే నిర్బంధమేనా!

### క్షేత్రస్థాయిలో వార్తా సేకరణే సవాల్‌గా మారుతోందా?

గ్రామంలో భూవివాదం బయటపడాలన్నా.. ప్రభుత్వ పథకాల్లో అక్రమాలు వెలుగు చూడాలన్నా.. ప్రజల సమస్యలు అధికారుల దృష్టికి చేరాలన్నా.. ముందుగా క్షేత్రస్థాయికి వెళ్లేది జర్నలిస్టే. ఎండనకా, వాననకా ప్రజల మధ్య తిరుగుతూ వాస్తవాలను వెలికితీసే పాత్రికేయుడికే భద్రత లేకపోతే ప్రజాస్వామ్యంలో సమాచార స్వేచ్ఛ పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. వార్త రాసినందుకు బెదిరింపులు, ప్రశ్నించినందుకు నిర్బంధాలు, విధి నిర్వహణలో ఆటంకాలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు పత్రికా స్వేచ్ఛపై చర్చకు దారితీస్తున్నాయి. పత్రికలో వార్త ప్రచురించినా, టెలివిజన్‌లో ప్రసారం చేసినా, డిజిటల్ వేదికపై ప్రజలకు సమాచారం అందించినా పాత్రికేయుడి లక్ష్యం వాస్తవాలను సమాజం ముందుంచడమే. అయితే ఆ బాధ్యతను నిర్వర్తించే సమయంలో వృత్తిపరమైన గౌరవం, చట్టబద్ధమైన రక్షణ, అవసరమైన సహాయం అందుతున్నాయా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది. 2026 అక్టోబర్ 10, 11 తేదీల్లో భారత ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను కవర్ చేసిన జర్నలిస్టులు ఎదుర్కొన్న పరిస్థితులు అంతర్జాతీయ స్థాయిలో చర్చకు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అమెరికా కేంద్రంగా పనిచేసే కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ అక్టోబర్ 12న ప్రచురించి, అక్టోబర్ 15న సవరించినట్లు పేర్కొన్న నివేదిక ప్రకారం న్యూఢిల్లీ, అహ్మదాబాద్, పుణె, ముంబై నగరాల్లో కనీసం 43 మంది జర్నలిస్టులు తాత్కాలిక నిర్బంధానికి గురయ్యారు. ప్రెస్ గుర్తింపు కార్డులు చూపించినప్పటికీ కొందరిని అదుపులోకి తీసుకున్నారని, మరికొందరిని వార్తా సేకరణ సమయంలో అడ్డుకున్నారని, ఫోన్లు, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారని ఆ నివేదిక పేర్కొన్నట్లు సమాచారం. అక్టోబర్ 12న రాయిటర్స్ ప్రచురించినట్లు పేర్కొన్న కథనంలోనూ నిరసనల కవరేజీలో పాత్రికేయులు ఎదుర్కొన్న ఆటంకాలు ప్రస్తావనకు వచ్చాయి. అయితే గుర్తింపు కార్డు ఉన్నంత మాత్రాన ప్రతి నిర్బంధాన్ని చట్టవిరుద్ధంగా పరిగణించలేం. అదే సమయంలో వార్తా సేకరణలో ఉన్న జర్నలిస్టులపై తీసుకున్న ప్రతి చర్యనూ సమర్థించలేం. నిర్బంధానికి కారణమేమిటి? పరికరాల స్వాధీనానికి చట్టబద్ధమైన ఆధారాలున్నాయా? విధి నిర్వహణకు ఆటంకం కలిగిందనే ఫిర్యాదులపై విచారణ జరిగిందా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. పత్రికా స్వేచ్ఛకు ప్రభుత్వాలు ప్రకటించే మద్దతు క్షేత్రస్థాయిలోనూ కనిపించాలి. వార్తలో తప్పులుంటే ఆధారాలతో ఖండించే అవకాశం ఉంది. చట్ట ఉల్లంఘన జరిగితే నిష్పక్షపాతంగా విచారించే వ్యవస్థ ఉంది. కానీ ప్రశ్నలు అడిగినందుకు బెదిరించడం, వార్తా సేకరణను అడ్డుకోవడం, పరికరాలను స్వాధీనం చేసుకోవడం వంటి ఆరోపణలను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదు. ప్రజల భద్రతను కాపాడే అధికారుల చట్టబద్ధ విధులకు గౌరవం ఇస్తూనే జర్నలిస్టుల వృత్తి స్వేచ్ఛను పరిరక్షించే విధానాలు అవసరం. 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ 180 దేశాలు, ప్రాంతాల్లో 157వ స్థానంలో నిలిచినట్లు అందిన సమాచారం పేర్కొంటోంది. ఒక అంతర్జాతీయ ర్యాంకింగ్ ఆధారంగా దేశంలోని ప్రతి ప్రాంతంలో పరిస్థితులను ఒకే విధంగా అంచనా వేయలేకపోయినా, జర్నలిస్టుల భద్రత, సమాచార స్వేచ్ఛపై వ్యక్తమవుతున్న ఆందోళనలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. నిరసనలు, ఘర్షణలు, ప్రమాదకర పరిస్థితులను కవర్ చేసే సమయంలో పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధుల మధ్య సమన్వయం ఉండాలి. ప్రతి జిల్లాలో అత్యవసర సంప్రదింపు వ్యవస్థను ఏర్పాటు చేయాలి. విధి నిర్వహణలో దాడులు, బెదిరింపులు, నిర్బంధాలకు సంబంధించిన ఫిర్యాదులు అందినప్పుడు నిర్ణీత కాలవ్యవధిలో విచారణ పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని పరిశీలించే సందర్భంలో రాజ్యాంగ హక్కులు, అధికారుల చట్టబద్ధ విధులు, న్యాయపరమైన పర్యవేక్షణ మధ్య సమతుల్యత పాటించాలి. చట్టం రూపొందించడం మాత్రమే కాకుండా అది క్షేత్రస్థాయిలో అమలవుతోందా? బాధితులకు న్యాయం అందుతోందా? అన్న అంశాలను కూడా నిరంతరం సమీక్షించాలి. నిరసనల కవరేజీ సందర్భంగా మహిళా జర్నలిస్టులపై వేధింపులు జరిగాయనే ఆరోపణలపై అక్టోబర్ 15న సుప్రీంకోర్టులో విచారణ జరిగినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. సంబంధిత ఘటనలపై స్పందనలు కోరడంతోపాటు సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం. ఒక మహిళా జర్నలిస్టుపై నమోదైన కేసులో బలవంతపు చర్యలు తీసుకోరాదని మధ్యంతర రక్షణ కల్పించినట్లు కూడా కథనాలు పేర్కొన్నాయి. ఈ అంశాల్లో పిటిషనర్ల ఆరోపణలు, ప్రతివాదుల వాదనలు, న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను వేర్వేరుగా పరిశీలించాలి. విచారణ పూర్తికాకముందే ఎవరినీ దోషిగా నిర్ధారించడం సముచితం కాదు. అయితే మహిళా జర్నలిస్టులకు గోప్యతతో కూడిన ఫిర్యాదు వ్యవస్థ, నిష్పక్షపాత విచారణ, అవసరమైన న్యాయ సహాయం అందుబాటులో ఉండాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి. జర్నలిస్టుల భద్రత అంటే విధి నిర్వహణ సమయంలో దాడుల నుంచి రక్షించడం మాత్రమే కాదు. అనారోగ్యం, ప్రమాదం, వైకల్యం, మరణం వంటి క్లిష్ట పరిస్థితుల్లో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యం. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ 2026 ఆగస్టు 5న విడుదల చేసినట్లు పేర్కొన్న వివరాల ప్రకారం జర్నలిస్టుల సంక్షేమ పథకం కింద 2014–15 నుంచి 2025–26 వరకు 456 మంది జర్నలిస్టులు, మీడియా సిబ్బంది లేదా వారి కుటుంబాలకు రూ.19.41 కోట్ల ఆర్థిక సహాయం అందించారు. జర్నలిస్టులపై దాడులు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యం. ప్రతి జిల్లాలో మీడియా ప్రతినిధులు, సంబంధిత ప్రభుత్వ విభాగాల అధికారులు, న్యాయ నిపుణులతో కూడిన సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించవచ్చు. నిరసనలు, ఘర్షణాత్మక పరిస్థితుల్లో వార్తా సేకరణకు సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించాలి. అత్యవసర సంప్రదింపు నంబర్లు, ప్రాంతీయ సమన్వయ అధికారులు అందుబాటులో ఉండాలి. మీడియా సంస్థలు కూడా తమ ప్రతినిధులకు ప్రమాద నివారణ శిక్షణ, బీమా, అత్యవసర సహాయం కల్పించాలి. పాత్రికేయ సంఘాలు బాధితులకు అండగా నిలవడంతోపాటు ప్రతి ఘటనకు సంబంధించిన ఆధారాలను నమోదు చేయాలి. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తన చట్టబద్ధ పరిధిలో అందిన ఫిర్యాదులను పరిశీలించాలి. ప్రభుత్వాలు విచారణల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై కాలానుగుణంగా వివరాలు వెల్లడించాలి.

# మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

**నలుగురి బలి! 24 గంటల్లో రెండు చోట్ల కాల్పులు..**

- సంగీత కార్యక్రమంపై రాళ్ల దాడి.. కాల్పుల్లో యువకుడి మృతి
- వంటచెరుకు కోసం వెళ్లిన వారిపై సాయుధుల కాల్పులు.. ముగ్గురు దుర్మరణం
- మృతదేహాలతో ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఆందోళన
- నిరసనలతో స్తంభించిన ఇంఫాల్.. పోలీసుల లాఠీఛార్జ్
- క్షతగాత్రులను పరామర్శించిన ముఖ్యమంత్రి లోకేషోర్ సింగ్






**ఇంఫాల్, అక్టోబర్ 19:** ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. గత 24 గంటల వ్యవధిలో రాష్ట్రంలోని రెండు ప్రాంతాల్లో చోటుచేసుకున్న వేర్వేరు కాల్పుల ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. పలువురు గాయపడ్డారు. ఆదివారం రాత్రి ఓ సంగీత కార్యక్రమం వద్ద దుండగులు రాళ్లు రువ్వడంతోపాటు కాల్పులు జరపగా ఓ యువకుడు మృతి చెందాడు. సోమవారం ఉదయం తూర్పు ఇంఫాల్ జిల్లాలోని ఖమేన్‌లోక్ సమీపంలోని కొండ ప్రాంతంలో వంటచెరుకు సేకరించేందుకు వెళ్లిన వారిపై సాయుధులు కాల్పులు జరపడంతో మరో ముగ్గురు మరణించారు. వరుస హింసాత్మక ఘటనలతో స్థానిక ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇంఫాల్‌లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపట్టారు. దీంతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మైతీ, పంగల్ ముస్లిం వర్గాల ప్రజలు నివసించే ప్రాంతంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సంగీత కార్యక్రమం వద్ద హింస చెలరేగినట్లు సమాచారం. కార్యక్రమం కొనసాగుతున్న సమయంలో కొందరు దుండగులు రాళ్లు రువ్వడంతో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం కాల్పులు జరగడంతో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడైంది. ఉత్సాహంగా సాగాల్సిన సంగీత కార్యక్రమం హింసాత్మక ఘటనగా మారడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కాల్పులకు పాల్పడిన వారి వివరాలు, దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మొదటి ఘటన జరిగిన కొద్ది గంటలకే సోమవారం ఉదయం మరో విషాదం చోటుచేసుకుంది. తూర్పు ఇంఫాల్ జిల్లాలోని ఖమేన్‌లోక్ సమీపంలోని కొండ ప్రాంతంలో వంటచెరుకు సేకరించేందుకు వెళ్లిన వ్యక్తులపై సాయుధులు కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ దాడిలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు పేర్కొన్నాయి. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటనకు గిరిజన సాయుధ మిలిటెంట్లు పాల్పడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, దాడికి బాధ్యులెవరన్నది అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది. వరుస కాల్పుల ఘటనలపై స్థానిక గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హింసను అరికట్టాలని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇంఫాల్‌లో భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఆందోళనల్లో పాల్గొనడంతో నగరంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నిరసనల ప్రభావంతో పలు ప్రాంతాల్లో సాధారణ కార్యకలాపాలకు అంతరాయం కలిగినట్లు సమాచారం. హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన ఇద్దరి మృతదేహాలను నిరసనకారులు ముఖ్యమంత్రి నివాసం ఎదుట ఉంచి ఆందోళన చేపట్టినట్లు సమాచారం. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు రంగంలోకి దిగారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేసినట్లు కథనాలు వెల్లడించాయి. కాల్పుల్లో గాయపడి రాజ్ మెడిసిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ముఖ్యమంత్రి థోక్‌చోమ్ లోకేషోర్ సింగ్ పరామర్శించినట్లు సమాచారం. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు కథనాలు పేర్కొన్నాయి. వరుస హింసాత్మక ఘటనల నేపథ్యంలో ప్రజల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. మణిపూర్‌లో మళ్లీ కాల్పులు చోటుచేసుకోవడం రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించడం, పలువురు గాయపడటం, అనంతరం పెద్ద ఎత్తున నిరసనలు జరగడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దాడులకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు హింస పునరావృతం కాకుండా భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# చెరకు రైతుల ఆందోళనలు

**ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం డీకే లేఖ!**







**బెంగళూరు, అక్టోబర్ 19:** ఉత్తర కర్ణాటకలో చెరకు రైతుల ఆందోళనల కారణంగా చక్కెర మిల్లుల్లో చెరకు క్రషింగ్ నిలిచిపోవడంతో ఏర్పడిన తీవ్ర సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసాన్ని ముట్టడించేందుకు రైతులు నిర్వహిస్తున్న పాదయాత్రలు, రహదారుల దిగ్బంధనాల వల్ల ప్రజాజీవితం తీవ్రంగా ప్రభావితమవుతోందని, పంట చేతికొచ్చి పొలాల్లోనే పాడైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా కేంద్రం ఐదు కీలక అంశాలపై తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా 2019 ఫిబ్రవరి నుంచి చక్కెర కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కిలోకు రూ.31 గానే ఉన్నప్పటికీ, చెరకు మద్దతు ధర టన్నుకు రూ.2,750 నుంచి రూ.3,650కి పెరిగిందని లేఖలో పేర్కొన్నారు. పాత చక్కెర ధరల వద్ద మిల్లులు రైతులకు సరైన ధరను చెల్లించలేకపోతున్నందున వెంటనే ఎంఎస్‌పీని సవరించాలని కోరారు. దీనితో పాటు సాధారణ గృహ వినియోగదారులకు భారం పడకుండా బల్క్ కమర్షియల్ కొనుగోలుదారుల నుంచి సరైన ధర రాబట్టేలా చక్కెర ధరల వర్గీకరణ చేయాలని సూచించారు. అలాగే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) ఇటీవల విడుదల చేసిన టెండర్లలో చెరకు రసం, షుగర్ సిరప్ ద్వారా తయారు చేసే ఇథనాల్‌ను మినహాయించడం సరికాదని, ఇది మిల్లుల ఆదాయాన్ని దెబ్బతీసి రైతులకు చెల్లింపులు నిలిచిపోయేలా చేస్తుందని వివరించారు. ఇక ఎఫ్ఆర్‌పీ నిరంతరం పెరుగుతున్నప్పటికీ చెరకు రసం ద్వారా తయారు చేసే ఇథనాల్ ధరలు 2022–23 నుంచి పెరగలేదని, ధాన్య ఆధారిత ఇథనాల్ ధరలను పెంచినట్లే వీటిని కూడా పెంచాలని కోరారు. చక్కెర రికవరీ బేస్‌ను 10.25 శాతానికి పెంచడం వల్ల తక్కువ రికవరీ ఉండే ప్రాంతాల రైతులకు పూర్తి ఎఫ్ఆర్‌పీ అందడం లేదని, పాత పద్ధతి ప్రకారం దీనిని తిరిగి 9.50 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పరిధిలోని అధికారాలను ఉపయోగిస్తూ ఇప్పటికే చక్కెర మిల్లుల డిజిటల్ వేయింగ్ సిస్టమ్, ల్యాబ్ అక్రిడిటేషన్లతో పాటు టన్నుకు అదనంగా రూ.100 చొప్పున (ఇందులో రూ.50 రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తూ) రైతులకు రూ.290 కోట్లు విడుదల చేశామని సీఎం స్పష్టం చేశారు. రైతుల ప్రధాన డిమాండ్లు కేంద్ర పరిధిలోనే ఉన్నందున ప్రధాని మోదీ తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సీజేపీ నేతలకు మరో రెండు రోజుల కస్టడీ!

- అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌ల నిర్బంధం అక్టోబర్ 21 వరకు పొడిగింపు
- ఐదు రోజులు కోరిన ఢిల్లీ పోలీసులు.. రెండురోజులకే కోర్టు అనుమతి
- విడుదల పిటిషన్‌పై నిర్ణయాన్ని రిజర్వు చేసిన న్యాయస్థానం
- అక్రమ అరెస్టులు, విచారణలో జాప్యమంటూ సీజేపీ ఆరోపణలు
- మేజిస్ట్రేట్‌కు బెదిరింపుల వ్యవహారంలో మరో కేసు నమోదు



**ఢిల్లీ, అక్టోబర్ 19:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు అశుతోశ్ రాంకా, సౌరవ్‌దాస్‌ల జ్యుడీషియల్ కస్టడీని మరో రెండు రోజులు పొడిగించారు. ఢిల్లీలోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ న్యాయస్థానం ఈ నెల 21 వరకు వారి కస్టడీని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు నాయకుల కస్టడీని మరో ఐదు రోజులు పొడిగించాలని ఢిల్లీ పోలీసులు కోరగా, న్యాయస్థానం రెండు రోజుల పొడిగింపునకు మాత్రమే అనుమతించింది. మరోవైపు వారిని విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం తన నిర్ణయాన్ని రిజర్వు చేసింది. అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌లను మరికొన్ని రోజులు కస్టడీలో ఉంచాల్సిన అవసరం ఉందని ఢిల్లీ పోలీసులు న్యాయస్థానానికి వివరించినట్లు సమాచారం. వారి నిర్బంధాన్ని మరో ఐదు రోజులు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అయితే పోలీసుల అభ్యర్థనను పరిశీలించిన ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ రెండు రోజుల పొడిగింపునకు మాత్రమే అనుమతించారు. దీంతో ఇద్దరు నాయకుల కస్టడీ అక్టోబర్ 21 వరకు కొనసాగనుంది. అంతకుముందు ముందస్తు నిర్బంధ చర్యల్లో భాగంగా వారిని ఐదు రోజుల కస్టడీకి పంపించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇద్దరు నాయకులను విడుదల చేయాలని కోరుతూ సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఇరుపక్షాల వాదనలను పరిశీలించి నిర్ణయాన్ని రిజర్వు చేసినట్లు సమాచారం. దీంతో రాంకా, దాస్‌ల విడుదల అంశంపై న్యాయస్థానం తదుపరి నిర్ణయం కీలకంగా మారింది. తమ పార్టీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపించింది. న్యాయస్థానంలో విచారణ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని విమర్శించింది. నాయకుల విడుదల కోసం పూచీకత్తు ఇవ్వడానికి ముందుకొచ్చిన వ్యక్తులను కూడా సరైన కారణాలు చూపకుండా తిరస్కరించారని ఆరోపించింది. పోలీసుల చర్యలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పార్టీ నాయకులు తమ నేతల విడుదల కోసం న్యాయపరమైన ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల వివరణ తెలియాల్సి ఉంది. ఈ కేసు విచారణ చేపడుతున్న మేజిస్ట్రేట్‌కు బెదిరింపులు వచ్చినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఈ వ్యవహారంలో గుర్తుతెలియని వ్యక్తులపై పోలీసులు నాన్ కాగ్నిజబుల్ నివేదిక నమోదు చేసినట్లు సమాచారం. బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల గుర్తింపు, ఘటనకు సంబంధించిన ఇతర వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఈ నెల 13న సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా, అజింక్య షిండే సహా సీజేపీకి చెందిన మొత్తం 14 మంది ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. అంతేకాకుండా తమ విధుల నిర్వహణకు సీజేపీ నాయకులు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అనంతరం నాయకుల నిర్బంధం, విడుదల అంశాలపై న్యాయపరమైన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కేసులో అదుపులోకి తీసుకున్న వారిలో అజింక్య షిండేకు ఇప్పటికే షరతులతో కూడిన బెయిల్ మంజూరైనట్లు సమాచారం. అయితే అశుతోశ్ రాంకా, సౌరవ్ దాస్‌ల కస్టడీ కొనసాగుతోంది. వారి విడుదల పిటిషన్‌పై న్యాయస్థానం నిర్ణయం వెలువరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 21 వరకు కస్టడీ పొడిగింపు, విడుదల పిటిషన్‌పై రిజర్వు చేసిన నిర్ణయం తదుపరి పరిణామాల్లో కీలకంగా మారనున్నాయి.

# సిద్దిపేటలో టీజీపీఎస్సీ పరీక్షలకు సర్వం సిద్ధం

- రెండు కేంద్రాల్లో 330 మంది అభ్యర్థులకు పరీక్షలు
- పారదర్శక నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి




**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19, :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24, 26 తేదీల్లో నిర్వహించనున్న నియామక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్ నుంచి టీజీపీఎస్సీ చైర్మన్ బుర్ర వెంకటేశం కమిషన్ సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, పోలీస్ సూపరింటెండెంట్లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ నెల 24న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్-II), 26న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించ నున్నారు. పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికా రులను చైర్మన్ ఆదేశించారు. సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయాల సముదా యం నుంచి సమావేశంలో పాల్గొన్న జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొత్తం 330 మంది అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పరీక్షలను పూర్తి పారదర్శకంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ వీడియో సమావేశంలో అదనపు డీసీపీ (ఏఆర్ అడ్మిన్) సుభాష్ చంద్రబోస్, ఏవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్యనగర్ కాలనీలో ఘనంగా దసరా దుర్గా నవరాత్రి ఉత్సవాలు

- 15వ ఏటా స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** అయోధ్యనగర్ కాలనీలో స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా దుర్గా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత 15 సంవత్సరాలుగా అసోసియేషన్ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తూ, కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బాబీ, సోమయ్య, సత్యనారాయణ, ఉమేష్ సింగ్‌తో పాటు స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నదాన వితరణను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్దిరాములు, పోగు సమ్మాన్ నేత, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రతి సంవత్సరం దుర్గా నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ, భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలను చేపడుతున్న స్టార్ యూత్ అసోసియేషన్ సభ్యులను పలువురు అభినందించారు.



## ఘనంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదిన వేడుకలు

- శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించి, హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా తోటకూర వజ్రేష్ యాదవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ప్రజలకు సేవ చేస్తూ పార్టీకి మరింత గుర్తింపు తీసుకురావాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తల సమక్షంలో జన్మదిన వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ కార్యక్రమంలో డీసీసీ సభ్యులు, జిల్లా స్థాయి నాయకులు, నియోజకవర్గ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్‌యూఐ, ఐఎన్‌టీయూసీ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని తోటకూర వజ్రేష్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- మహిళల ఐక్యతకు, ఆత్మీయ అనుబంధాలకు బతుకమ్మ వేడుకలు నిదర్శనం: మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఐలయ్య గౌడ్

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే గొప్ప పండుగ బతుకమ్మ అని మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ ఐలయ్య గౌడ్ అన్నారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని రోడామేస్త్రినగర్ డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్‌లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండుగ ప్రాంగణమంతా సందడి నెలకొంది. ఈ కార్యక్రమానికి హాజరైన గూడ వరమ్మ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజల జీవన విధానానికి, మహిళల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందంగా జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన విశిష్టత ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పే బతుకమ్మ పండుగను భావితరాలకు కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, ఆర్థికంగా స్వావలంబన పొందేలా ప్రభుత్వాలు మరిన్ని అవకాశాలు కల్పించాలని ఆమె ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో మహిళలు, యువతుల అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. మహిళల ఐక్యతను, కుటుంబాల మధ్య ఆత్మీయ అనుబంధాలను మరింత బలోపేతం చేసే ఇలాంటి పండుగలు సమాజంలో సంతోషాన్ని, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అనంతరం మహిళలంతా కలిసి బతుకమ్మ ఆడుతూ, పాటలు పాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బురుగు రోహిత్, సాయి పూజ గౌడ్, డ్వాక్రా సంఘాల కమిటీ సభ్యులు జె. మంగ, తిరుపతమ్మ, లక్ష్మి , సులోచన, మౌనిక, సోనీ తదితరులు పాల్గొన్నారు.



# దసరా ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ పాలకవర్గం

- రావణాసురుడి దహన కార్యక్రమం, విద్యుద్దీపాల అలంకరణపై అధికారులకు సూచనలు

**సదాశివపేట, అక్టోబర్ 19, :** దసరా పండుగను పురస్కరించుకుని సోమవారం నాడు సదాశివపేట పట్టణంలోని దుర్గమ్మ మందిరం వద్ద చేపడుతున్న ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ టి. శివాజీ, చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్లూరి నాగరాజు గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా రావణాసురుడి దిష్టిబొమ్మ తయారీ పనులను పరిశీలించిన వారు, కార్యక్రమ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దసరా వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా విద్యుద్దీపాల అలంకరణ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని, లైట్ల వెలుగులతో పరిసరాలు కనువిందు చేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సింలు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విజయదశమి అందరికి విజయాలు చేకూర్చాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ, వాహన పూజలు

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19, :** విజయదశమి పండుగ ప్రజలకు అన్ని రంగాలలో విజయం చేకూర్చాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆర్మడు రిజర్వ్ విభాగంలో ఆయుధ పూజ, వాహన పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయదశమి పర్వదినోత్సవం అందరికి సుఖ సంతోషాలు కలిగించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరియు పోలీస్ అధికారులకు సిబ్బందికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పూజా కార్యక్రమాలలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డిఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రవికుమార్, ఇన్స్పెక్టర్లు వేణు, ఆరిఫ్ అలీ ఖాన్, కరుణాకర్, శ్రీనివాస్, శ్రీధర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## తుల్జా భవాని అమ్మవారికి పట్లూరి ప్రసాద్ గౌడ్ దంపతుల ప్రత్యేక పూజలు

### అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థన



**సదాశివపేట, అక్టోబర్ 19, :** దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తుల్జా భవాని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మవారి పూజా కార్యక్రమంలో సోమవారం పట్లూరి ప్రసాద్ గౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని వారు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తి భావంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.

## యెండమూరి లేఅవుట్ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** గాజులరామారం పరిధిలోని మహాదేవపురం యెండమూరి లేఅవుట్‌లో బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కాలనీలో మహిళలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. మహిళల కోలాహలం, బతుకమ్మ పాటలతో యెండమూరి లేఅవుట్‌లో పండుగ శోభ సంతరించుకుంది. ఈ వేడుకల్లో సుమన్ రెడ్డి, అడ్వకేట్ శివానంద్, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, వీరబాబు, అఖేలా శ్రీనివాస్, చందు, భీమా రెడ్డి, అంజి రెడ్డి, రాయుడు, సుధీర్, బాలకృష్ణ, హనుమంత్ రెడ్డి, దరువు అంజన్న, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతిని భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని అన్నారు. సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను అందరూ కలిసి జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి సతీమణి అనురాధ



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి సతీమణి శ్రీమతి అనురాధ రంగురంగుల బతుకమ్మలతో ఆదివారం పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# అమ్మవారి దయతో ప్రజలందరికీ విజయాలు చేకూరాలి

- **మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు**

**సదాశివపేట, అక్టోబర్ 19, :** దసరా పండుగ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ విజయాలు, సుఖసంతోషాలు కలగాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ రేణుక చిరు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో రాష్ట్రం సస్యశ్యామలం కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనావృష్టి సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కలగాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని ఆమె అన్నారు. ఈ పండుగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో విజయాలు సాధించాలని, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



# నేడు విజయదశమి సందర్భంగా ఈ ప్రత్యేక కథనం..

## జమ్మిచెట్టు పూజతో విజయానికి స్వాగతం.. విజయదశమి ప్రత్యేకత..

- **జమ్మి ఆకులే బంగారం.. పాలపిట్ట దర్శనం శుభ సూచకం..**
- **ప్రకృతి పరిరక్షణే అసలైన సంప్రదాయం**



చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగకు హిందూ సంప్రదాయంలో విశిష్టమైన స్థానం ఉంది. దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా జమ్మిచెట్టును పూజించడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి బంధుమిత్రులకు పంచుకోవడం, పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం తెలుగు ప్రజల సంస్కృతిలో ప్రత్యేకతను చాటుతున్నాయి. అదేవిధంగా విజయదశమి రోజున పాలపిట్టను దర్శించడం కూడా శుభసూచకంగా భావించే సంప్రదాయం కొనసాగుతోంది.

### జమ్మిచెట్టుకు ప్రత్యేక ప్రాధాన్యత..

భారతీయ సంస్కృతిలో వృక్షాలను దైవస్వరూపాలుగా భావించి పూజించే సంప్రదాయం అనాదిగా కొనసాగుతోంది. అందులో శమీ వృక్షంగా ప్రసిద్ధి చెందిన జమ్మిచెట్టుకు ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ నీటితోనూ పెరిగే సామర్థ్యం కలిగిన ఈ చెట్టు పర్యావరణ పరిరక్షణలో, నేల కోతను నివారించడంలో, పశువులకు మేత అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో జమ్మిచెట్టు ప్రజల జీవన విధానంతో విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉంది.

### పాండవుల ఆయుధాలకు ఆశ్రయం..

మహాభారత కథనం ప్రకారం, అజ్ఞాతవాసానికి వెళ్లే సమయంలో పాండవులు తమ ఆయుధాలను జమ్మిచెట్టుపై దాచిపెట్టారు. అజ్ఞాతవాసం పూర్తయిన అనంతరం వాటిని తిరిగి స్వీకరించినట్లు పురాణ సంప్రదాయం చెబుతోంది. ఈ గాథ నేపథ్యంలో జమ్మిచెట్టు విజయానికి, ధైర్యానికి, కార్యసిద్ధికి ప్రతీకగా ప్రజల విశ్వాసాల్లో నిలిచింది. శ్రీరాముడు రావణుడిపై సాధించిన విజయాన్ని స్మరించుకునే విజయదశమి పర్వదినాన జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించడం విశేషంగా భావిస్తారు.

### జమ్మి ఆకులే ప్రజలకు బంగారం..

విజయదశమి రోజున జమ్మి ఆకులను బంగారంగా భావించి బంధుమిత్రులకు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పెద్దలకు జమ్మి ఆకులను అందించి ఆశీర్వాదాలు తీసుకోవడం, స్నేహితులు, బంధువులు పరస్పరం ఆకులను ఇచ్చిపుచ్చుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకోవడం ఈ పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జమ్మి ఆకులను బంగారంతో సమానంగా భావించడం వెనుక ఐశ్వర్యం, సౌభాగ్యం, పరస్పర ప్రేమాభిమానాలు వెల్లివిరియాలనే ఆకాంక్ష దాగి ఉంది.

### పాలపిట్ట దర్శనం శుభసూచకం..

విజయదశమి రోజున పాలపిట్టను దర్శిస్తే శుభం కలుగుతుందని ప్రజల్లో విశ్వాసం ఉంది. పాండవులకు పాలపిట్ట కనిపించిన అనంతరం విజయాలు సిద్ధించాయనే ప్రజల నమ్మకం ఈ సంప్రదాయానికి నేపథ్యంగా చెప్పబడుతుంది. అయితే పాలపిట్టలను పంజరాల్లో బంధించి తీసుకురావడం, వాటికి హాని కలిగించడం సరికాదని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. పక్షుల స్వేచ్ఛను కాపాడుతూ వాటి ఆవాసాలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలి.

### ప్రకృతి పరిరక్షణపై అవగాహన అవసరం..

పట్టణీకరణ, చెట్ల తొలగింపు కారణంగా పచ్చదనం తగ్గుతున్న నేపథ్యంలో జమ్మిచెట్ల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పండుగ సందర్భంగా పూజలు నిర్వహించడంతో పాటు జమ్మి మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం, పిల్లలకు వృక్షాలు, పక్షుల ప్రాముఖ్యతను తెలియజేయడం ద్వారా సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చు.

### జమ్మిచెట్టును పూజించడం సంప్రదాయం, జమ్మిచెట్టును కాపాడటం బాధ్యత

పాలపిట్టను దర్శించడం విశ్వాసం. దాని స్వేచ్ఛను కాపాడటం మన ధర్మం. ఆధ్యాత్మిక విశ్వాసాలతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విజయదశమి పండుగకు నిజమైన సార్థకత చేకూరుతుందని పర్యావరణ హితులు అభిప్రాయ పడుతున్నారు. సంప్రదాయాలను కాపాడుతూ.. ప్రకృతిని పరిరక్షిస్తూ.. విజయాలు, సుఖసంతోషాలతో ప్రతి ఒక్కరి జీవితం వర్ధిల్లాలని విజయదశమి పర్వదినం సందేశమిస్తోంది.



**వ్యాసకర్త..**
**చేపూరి సత్యనారాయణ గౌడ్, సీనియర్ జర్నలిస్టు, సెల్:97054 44261..**

# పండుగ సాయన్న జయంతి వేడుకలకు సహకరించండి



- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరిన పులిమామిడి రాజు**

**సదాశివపేట, అక్టోబర్ 19, :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈ నెల 22న సంగారెడ్డి పట్టణంలో నిర్వహించనున్న తెలంగాణ వీరయోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ వేడుకలుగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని పులిమామిడి రాజు కలెక్టర్‌ను కోరారు. సభా వేదిక ఏర్పాటు, పూలమాలలతో నివాళులర్పించడం, వేదిక అలంకరణ, ప్రచార కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణ చరిత్రలో పండుగ సాయన్నకు విశిష్ట స్థానం ఉందని, ఆయన పోరాట స్ఫూర్తి, సేవలను భావితరాలకు తెలియజేసేలా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జనార్ధన్, పిట్టల రమేష్, మామిళ్ల ఆనంద్, రాజేష్, బుస్స సాయి, బస్వరాజ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమాదేవి నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ.. పూల పండుగతో పులకించిన కాలనీ**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ పరిధిలోని ఉమాదేవి నగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాలతో కాలనీలో పండుగ శోభ సంతరించుకుంది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి తెలంగాణ జానపద గీతాలను ఆలపిస్తూ, కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ, ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో ఆకర్షణీయంగా పేర్చిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళల ఉత్సాహం, పూల పరిమళాలు, జానపద గీతాల నడుమ ఉమాదేవి నగర్ అంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.





### ప్రకృతిని పూజించే పూల పండుగ బతుకమ్మ

బతుకమ్మ తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన సాంస్కృతిక పండుగ. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. ఆశ్వయుజ మాసంలో తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర కాలానుగుణ పూలతో బతుకమ్మలను పేర్చి గౌరమ్మను ఆరాధిస్తారు. చివరి రోజైన సద్దుల బతుకమ్మను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. బతుకమ్మ పండుగ కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. మహిళల ఐక్యతకు, కుటుంబ బంధాలకు, సామాజిక సమైక్యతకు ప్రతీక. ప్రకృతితో మమేకమై జీవించాలనే సందేశాన్ని అందించడంతో పాటు, తెలంగాణ జానపద కళలు, పాటలు, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేసే గొప్ప సాంస్కృతిక వేడుకగా బతుకమ్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

### సంప్రదాయాల పరిరక్షణకు బతుకమ్మ వేడుకలు

### దోహదం

తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయడంలో బతుకమ్మ వంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఇటువంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు కాలనీవాసుల మధ్య ఆత్మీయత, స్నేహభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఉమాదేవి నగర్‌లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు మహిళల ఉత్సాహం, సంప్రదాయాల పట్ల వారికున్న అభిమానం, తెలంగాణ సంస్కృతిపై ఉన్న మమకారాన్ని చాటిచెప్పాయి. పూల పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్న మహిళలు, కాలనీవాసులు వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా భాగస్వాములయ్యారు.

# ఆయుష్ శాఖలో 8 ఉద్యోగాలు

**జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**




**జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19, :** జాతీయ ఆయుష్ మిషన్ పరిధిలో జగిత్యాల జిల్లాలో 8 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ తెలిపారు. ఇందులో మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్ట్, సైకలాజికల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులు ఉన్నాయి. ఈ నెల 22 నుండి 27 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు జగిత్యాల్.తెలంగాణ.గోవ్.ఇన్ వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు.

# కూకట్‌పల్లిలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావ

**కుడుపల్లి ప్రతినిధి, అక్టోబర్ 19, :** సోమవారం కూకట్పల్లి రామాలయం మైత్రి నగర్‌లోని కెన్నెడీ స్కూల్ సమీపంలో అమ్మవారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది.



# సాయినగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కుకట్పల్లి ప్రతినిధి,అక్టోబర్ 19,:** సోమవారం బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్ ఫిరోజా గూడ ప్రాంతాల్లో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అమ్మవారిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దర్శించుకున్నారు ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు స్థానికులు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రజాసేవే లక్ష్యం.. అభివృద్ధే ధ్యేయం..

- నియోజకవర్గంలో అభివృద్ధి ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర
- రేపు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, అక్టోబర్ 19, :** ప్రజా జీవితంలో నాయకుడి ప్రయాణం అనేది కేవలం పదవులకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపై స్పందించడం, వారి అవసరాలను గుర్తించడం, అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయడం వంటి అంశాలతో ముడిపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం సందర్భంగా ఆయన రాజకీయ ప్రస్థానం, నియోజకవర్గ అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలపై ఆయన నిర్వహిస్తున్న పాత్రను పరిశీలిద్దాం.

**రాజకీయ ప్రస్థానం.. ప్రజా ప్రాతినిధ్యం..**

సివిల్ ఇంజినీరింగ్ విద్యా నేపథ్యం కలిగిన కేపీ వివేకానంద్ రాజకీయాల్లోకి ప్రవేశించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన, 2018, 2023 ఎన్నికల్లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు. ప్రస్తుతం భారత రాష్ట్ర సమితి నాయకుడిగా, శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు.

**అభివృద్ధి.. ప్రజల ఆకాంక్షలు..**

వేగంగా విస్తరిస్తున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రహదారులు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, పార్కులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరచడం ప్రజాప్రతినిధుల ముందున్న ప్రధాన బాధ్యత. అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సదుపాయాలు, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు నియోజకవర్గ భవిష్యత్తును నిర్ణయించడంలో కీలకంగా నిలుస్తాయి.

**ప్రజా సమస్యల పరిష్కారమే కీలకం..**

ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం ప్రజాప్రతినిధుల బాధ్యత. కుత్బుల్లాపూర్‌లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ప్రజలకు వాటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందుతాయి.

**భవిష్యత్తుపై ఎన్నో ఆశలు..**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమన్వయం, ప్రణాళికాబద్ధమైన పనులు అవసరం. యువతకు ఉపాధి అవకాశాలు, మెరుగైన వైద్య సదుపాయాలు, విద్యా వసతులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపైనా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**జన్మదిన శుభాకాంక్షలు..**

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ సందర్భంగా నియోజక వర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి కొనసాగాలని ఆకాంక్షిద్దాం. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి దిశగా మరిన్ని కార్యక్రమాలు ముందుకు సాగాలని కోరుకుంటూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

# ప్రభుత్వ పథకాలను "సద్వినియోగం" చేసుకోవాలి

- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19, :** భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఈనెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వ జన సురక్షా భీమా పథకాలైన "ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన", "ప్రధాన మంత్రి సురక్షా భీమా యోజన" కోసం జిల్లా పరిధిలో ఉన్న అర్హులైన వారందరూ నమోదు చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ అన్నారు. సహజ మరణం, ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే ఆ కుటుంబ సభ్యులైన నామినీకి కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఆర్థిక భరోసా ఇస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని బ్యాంకుల బ్రాంచీలు తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఖచ్చితంగా శిబిరాలు నిర్వహించి ఎక్కువ మొత్తంలో నమోదు చేయాలని, రీ కేవైసీ పెండింగ్ కూడా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే అన్ని బ్యాంకుల ఉన్నతాధికారులతో మాట్లాడి తదనుగుణంగా కార్యచరణ రూపొందించామని అమలు పరచడానికై తగు ప్రణాళిక సిద్ధం చేసినట్లుగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ కుమార్ తెలిపారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్**

**జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19, :** ప్రజావాణి ద్వారా ప్రజల నుండి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుండి అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకొని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి దరఖాస్తును అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె. వై. ప్రసాద్, ఆర్డీఓలు మధు సూదన్, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఈ విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలను అందించాలి

- జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



**జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19, :** విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్యప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఇంటా ఆనందోత్సాహాలను నింపాలని ఆకాంక్షించారు. దృఢమైన సంకల్పం, పట్టుదలతో ముందుకు సాగితే విజయం తప్పక సిద్ధిస్తుందనే స్ఫూర్తిని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీస్సులతో జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో జీవించాలని, చేపట్టిన ప్రతి కార్యంలో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, సానుకూలత, విజయాలను తీసుకురావాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కోరినారు.

# కూకట్‌పల్లి దుర్గమ్మ ఆలయంలో వైభవంగా పూర్ణాహుతి హోమం

- మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు దివ్యదర్శనం
- లోకకల్యాణం ప్రజల సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

**కూకట్పల్లి ప్రతినిధి,అక్టోబర్ 19, :** సుమిత్రానగర్‌లోని దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూర్ణాహుతి హోమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేదమంత్రోచ్చారణలు మంగళవాయిద్యాలు అమ్మవారి నామస్మరణల మధ్య ఆలయ పెద్ద పంతులు వేమూరు వంశీకృష్ణ ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. లోకకల్యాణం ప్రజల ఆయురారోగ్యాలు కుటుంబాల సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు సుమిత్రానగర్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమంలో టెంపుల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధి భాస్కర్ ఆలయ ఈఓ ఆలయ సిబ్బంది టెంపుల్ టీమ్ సభ్యులు స్థానిక ప్రజలు కాలనీ పెద్దలు మహిళలు యువకులు భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు పంతులు సిబ్బంది స్థానికుల సమష్టి సహకారంతో పూర్ణాహుతి హోమం విజయవంతంగా నిర్వహించారు. మహిషాసుర మర్దిని దేవి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ఆకాంక్షించారు.



# దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి

**జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 19, :** జగిత్యాల పట్టణంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ దుర్గామాత మండపాలను సందర్శించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులతో జగిత్యాల నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గం పాడి పంటలతో సుభిక్షంగా వర్ధిల్లాలని, రైతులకు మంచి దిగుబడులు లభించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్లినో ప్రభావం త్వరగా తొలగిపోయి, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, రైతులు సంతోషంగా ఉండాలని దుర్గామాతను ప్రార్థించినట్లు తెలిపారు. దుర్గామాత కృపతో జగిత్యాల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది మరింత సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ జిల్లా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# దుర్గాభవాని అమ్మవారిని దర్శించుకున్న ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు అశోక్

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 19, :** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని తన స్వగ్రామమైన మంగేళ గ్రామంలో దుర్గాభవాని సేవా సమితి మంగేళ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాభవాని అమ్మవారిని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నారపాక అశోక్ తన భార్య దివ్య అశోక్, కుమార్తె అద్వైత నారపాకతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు పొందారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని అమ్మవారిని ప్రార్థించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాభవాని సేవా సమితి సభ్యులు, అమ్మవారి దీక్షపరులు, గ్రామా ప్రజలు పాల్గొన్నారు



# కృష్ణానగర్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు





- సొంత నిధులతో ఏర్పాటు చేసిన బతుకమ్మ బావిని ప్రారంభించిన అడువాల జ్యోతి

**జగిత్యాల ప్రతినిధి, అక్టోబర్ 19, :** జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మలను అందంగా అలంకరించగా, వాటిలో ఉత్తమంగా అలంకరించిన మొదటి పది బతుకమ్మలను ఎంపిక చేసి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం కృష్ణానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ బావిని అడువాల జ్యోతి తన సొంత నిధులతో నిర్మించగా ఆమె ప్రారంభించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఉపయోగపడేలా బతుకమ్మ బావిని ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పులి రమాదేవి, కో ఆప్షన్ వీరబత్తిని పద్మజ శ్రీనివాస్, శ్రీ అభయ ఆంజనేయ ఆలయ ట్రస్ట్ మెంబర్స్, స్థానికులు నాయకులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

### జీర్ణవ్యవస్థ

మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



### తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





### సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

### మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



### బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





### మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



### గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?



ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

### ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రోటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రోటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

### గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

### కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చుట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

### బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

### ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తినిపెంచుతాయి.

### చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.



# నవ్వుల రారాజు రాజబాబు

## నేడు రాజబాబు జయంతి

**పుణ్యమూర్తుల అప్పలరాజు అనగానే ఎవరా అని ఆలోచించ వచ్చు. రాజబాబు అంటే హాస్య నటునిగా తెలియని తెలుగు వారుండరు. రేలంగి, రమణారెడ్డి తరవాత అంతకు మించిన ప్రేక్షక ఆదరణ పొందిన నటునిగా గుర్తింపు పొందారు.**

తెలుగు సినిమా చరిత్రలోనే అత్యంత గొప్ప హాస్య నటుల్లో ఒకరు రాజబాబు. రెండు దశాబ్దాల తక్కువ వ్యవధిలో ఆయన శిఖర స్థాయిని అందుకున్నారు. దాదాపు 600 చిత్రాల్లో నటించిన రాజబాబు.. తెలుగు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తారు. అప్పట్లో ఆయన దక్షిణాదిన అత్యంత డిమాండ్ ఉన్న కమెడియన్లలో ఒకరు. రోజుకు రెండు మూడు షిఫ్టుల్లో విరామం లేకుండా పని చేసిన ఘనత ఆయనది. తెలుగు చలనచిత్ర రంగంలో రెండు దశాబ్దాలు హాస్య నటునిగా వెలిగిన రాజబాబు (అక్టోబరు 20, 1935 – ఫిబ్రవరి 14, 1983) "శతాబ్దపు హాస్య నటుడి"గా ప్రసంశలు అందుకొన్న గొప్ప వ్యక్తి. అక్టోబరు 20, 1935 తేదీన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం లో పుట్టిన రాజబాబు పూర్తి పేరు పుణ్యమూర్తుల అప్పలరాజు. తల్లిదండ్రులు పుణ్యమూర్తుల ఉమా మహేశ్వర రావు, రవణమ్మ. నిడదవోలు లోని పాఠశాల చదువు చదువుతూనే బుర్రకథ నేర్చుకోవడానికి శ్రీ అచ్యుత రామయ్య గారి దగ్గర చేరారు. ఇంటర్మీడియట్ పూర్తయిన తరువాత ఉపాధ్యాయ శిక్షణ కోర్సు ముగించి తెలుగు ఉపాధ్యాయునిగా కొద్దికాలం పని చేశారు. ఉపాధ్యాయునిగా పని చేసేటప్పుడే నాటకాలలో పాలుపంచు కొనేవారు. రాజబాబు డిసెంబరు 5, 1965 తేదీన లక్ష్మీ అమ్ములు ను వివాహమాడారు. వారికి నాగేంద్రబాబు, మహేశ్ బాబు అనే ఇద్దరు సంతానం కలిగారు. ఒక సారి నాటకంలో రాజబాబును చూసిన గరికపాటి రాజారావు (పుట్టిల్లు సినిమా దర్శకుడు) సినిమాలలో చేరమని ఉత్సాహ పరిచారు. దాంతో చెప్పా చెయ్యకనే ఫిబ్రవరి 7, 1960 రోజున మద్రాసు చేరుకొన్నారు. పూట గడవడానికి హాస్య నటుడు అడ్డాల నారాయణ రావు పిల్లలకు ప్రైవేటు చెప్పేవారు. కొన్నాళ్ళ తరువాత అడ్డాల నారాయణ రావు రాజబాబుకి సమాజం సినిమాలో అవకాశం కల్పించారు. మొదటి సినిమా తరువాత"తండ్రులు–కొడుకులు","కులగోత్రాలు","స్వర్ణగౌరి","మంచి మనిషి" మొదలగు చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. స్వర్ణగౌరి చిత్రానికి గాను 350 రూపాయలు మొట్టమొదటి పారితోషికంగా స్వీకరించారు. మొదటి చిత్రం విడుదల తరువాత వచ్చిన చిన్న చిన్న పాత్రలలో నటిస్తూనే "కుక్కపిల్ల దొరికిందా", "నాలుగిళ్ళ చావిడి", "అల్లూరి సీతారామరాజు" మొదలగు నాటకాలు వేశారు. జగపతి ఫిలింస్... వి.బి.రాజేంద్రప్రసాద్ చిత్రం "అంతస్తులు" చిత్రంలో నటించి నందుకు గాను మొట్ట మొదటి సారిగా పెద్దమొత్తం 1300 రూపాయల్ని పారితోషికంగా పొందారు. ఇక వెనక్కు తిరిగి చూసుకో వలసిన అవసరం లేకుండా వరుసగా నిర్మాణ సంస్థలు నిర్మించిన ఎన్నో చిత్రాలలో నటించారు. ఆకాశ రామన్న, సతీ శబరి, ప్రచండ భైరవి, సత్య హరిశ్చంద్ర, సంగీత లక్ష్మి, పరమానందయ్య శిష్యుల కథ, ఉమ్మడి కుటుంబం, విచిత్ర కుటుంబం లాంటి చిత్రాలలో నటించారు. రాజబాబుకు జంటగా లీలా రాణి, మీనా కుమారి, ప్రసన్న రాణి, గీతాంజలి లాంటి వారు నటించినా, ప్రేక్షకాదరణ పొందిన జోడీ మాత్రం రమాప్రభ అని చెప్పక తప్పదు. ఇద్దరు అమ్మాయిలు, ప్రేమనగర్, ఇల్లు ఇల్లాలు, పల్లెటూరి బావ, సెక్రెటరి, జీవన జ్యోతి, కార్తీక దీపం, అడవి రాముడు, సోగ్గాడు లాంటి చిత్రాలు రాజబాబు – రమాప్రభ జోడీకి మంచి హాస్య జంటగా పేరు తెచ్చాయి. రాజబాబు తాతా మనవడు, పిచ్చోడి పెళ్ళి, తిరుపతి, ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు లాంటి సినిమా లలో హీరోగా నటించారు. ఈ సినిమాలలో ఎవరికి వారే యమునా తీరే, మనిషి రోడ్డున పడ్డాడు సినిమాలను స్వయంగా బాబ్ ఒ బాబ్ ప్రొడక్షన్స్ అన్న నిర్మాణ సంస్థ పేరుతో నిర్మించారు. సినిమాలో ప్రేక్షకులను తన అద్భుత నటనతో కడుపుబ్బ నవ్వించిన రాజబాబు నిజ జీవితంలో గొప్ప తాత్విక ఆలోచనలు గలవారు. ప్రతి ఒక్క సంవత్సరం తన పుట్టిన రోజు సందర్భంగా పాతతరం నటుల్ని, నటీమణుల్ని సత్కరించే వారు. ప్రత్యేకంగా హాస్యంలో తనకు స్ఫూర్తిని ఇచ్చిన బాలకృష్ణను సత్కరించారు. రాజబాబుచే సత్కారం పొందిన వారిలో ఇంకా డా.శివరామ కృష్ణయ్య, సూర్యకాంతం, సావిత్రి, రేలంగి మొదలగు ప్రముఖులు ఉన్నారు. ఎన్నో సంస్థలకు ఎన్నెన్నో విరాళాలిచ్చిన దాత రాజబాబు. రాజమండ్రిలో చెత్తా చెదారం శుభ్రపరిచే వాళ్ళకు అదే ఊరిలో దానవాయి పేటలో భూమి ఇచ్చారు. అంతే కాక కోరుకొండలో జూనియర్ కాలేజీ కట్టించారు. దాని పేరు కూడా ఆయన పేరు మీదే "రాజబాబు జూనియర్ కళాశాల"గా ఉంది. వరుసగా ఏడు సార్లు ఫిలింఫేర్ అవార్డు పొందిన మొట్ట మొదటి హాస్య నటుడు రాజబాబు. ఆయన జీవితంలో మొత్తం తొమ్మిది ఫిలింమ్ ఫేర్ అవార్డులు, మూడు నంది బహుమతులు, ఎన్నెన్నో అవార్డులు రివార్డులూ పొందారు. "చెన్నై ఆంధ్రా క్లబ్బు" వారు వరుసగా ఐదు సంవత్సరాలు "రోలింగ్ షీల్డు"ని ప్రధానం చేసారు. అంతే కాక శతాబ్దపు హాస్య నటుడిగా అవార్డు పొందారు. రాజబాబుకు ఘంటసాల పాటలంటే ఎంతో ఇష్టం. మహా శివరాత్రి రోజు, ఘంటసాల వర్ధంతి అయిన ఫిబ్రవరి 11 రోజున మొత్తం ఘంటసాల పాటలు వింటూనే ఉన్నారు. అదే రోజు రాత్రి గొంతులో ఏదో ఇబ్బంది వచ్చి హైదరాబాదు లోని థెరెసా ఆసుపత్రిలో చేరాడు. ఆ ఆసుపత్రి లోనే ఫిబ్రవరి 14, 1983 రోజున తెలుగు సినీ అభిమానుల్ని శోక సముద్రంలో ముంచి స్వర్గస్తుడయ్యారు. అనుకరించడానికి అసాధ్యమైన ప్రత్యేకమైన శైలి రాజబాబుది. ఆయన మరణంతో తెలుగు చిత్రసీమకు కలిగిన లోటు ఎప్పటికి తీర్చలేనిది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# చెడుపై విజయమే విజయ దశమి

**నవరాత్రి పదంలో నవ శబ్దం తొమ్మిది సంఖ్యను సూచిస్తుంది. నవరాత్రులను నవ అహోరాత్రాలు అని ధార్మిక గ్రంధాలు వివరిస్తున్నాయి. అంటే తొమ్మిది పగళ్ళు, తొమ్మిది రాత్రులు నిర్వర్తించే దేవి పూజకు ఒక ప్రత్యక విధానం ఉంది. ఆశ్వయుజ శుక్ల పక్ష పాడ్యమి తిథి నుండి పూర్ణిమ వరకు తొమ్మిది రాత్రులు తొమ్మిది పగళ్ళు అమ్మవారిని పూజించడం ప్రశస్తంగా చెప్పబడింది. దీనినే 'శరన్నవరాత్రులు' లేదా 'దేవి నవరాత్రులు అంటారు.**



నవ రాత్రి వాస్తవానికి ఋతువుల సంధికాలం. అందుచేత సృష్టికి కారణమైన మహా మాయ తీవ్రవేగం కలిగి ఉంటుంది. పూజాదుల చేత ఆమెను ఆహ్వానించటం సులభ సాధ్యం. తొమ్మిది రోజులు నవ దుర్గలను నిష్ఠగా ఉపాసించే ఆరాధకులకు దేవి అనుగ్రహం లభిస్తుంది. నవ రాత్రులలో రాహుకాల వేళ రాహుకాల దీపం వెలిగించాలి. రాహు ప్రతికూల ప్రభావం తగ్గి, దోష నివారణ జరుగుతుంది. దేవి అర్చనలో లలితా సహస్రనామాలు, దుర్గాసప్తశతి పారాయణ చేసే భక్తుల కోరికలు నెరవేరుతాయి. రోగ పీడలతో బాధపడే వారు, జాతకంలో అపమృత్యు దోషం ఉన్నవారు ఈ తొమ్మిది రోజులు నియమం తప్పకుండా దేవి ఆరాధన చేయడం శుభకరం. సాధారణంగా విజయ దశమి నాడు శ్రవణ నక్షత్రం ఉంటుంది. నక్షత్ర మండలంలో శ్రవణ నక్షత్రం చెవి ఆకారంలో ఉంటుంది. అందుకే ఈ రోజు ఏదైనా కొత్త విద్యలు నేర్చుకోవాలనుకొనేవారు ఈ రోజు ప్రారంభిస్తే విశేషంగా లాభిస్తుంది. శమీ చెట్టు యొక్క పూజ ఈ రోజు విశేషంగా లాభిస్తుంది. జమ్మి చెట్టును పూజించడం లక్ష్మీప్రదమని పురాణాలు చెబుతున్నాయి. శమీ వృక్షం సువర్ణ వర్షం కురిపిస్తుందని శాస్త్రాల్లో ఉంది. విజయ దశమి రోజున పూజలు అందుకొన్న జమ్మి చెట్టు ఆకులను ఇంట్లోని పూజాస్థలంలో, ధన స్థానంలో నగదు పెట్టెల్లో ఉంచుతారు. దీనివల్ల ధనవృద్ధి జరుగుతుంది. పరమ శివునికి జగన్మాత దుర్గాదేవికి, సిద్ధి ప్రదాత గణపతికి శమీ పత్రి సమర్పించే ఆచారం అనాదిగా వస్తోంది. పూర్వం జమ్మి చెట్టు కాడల రాపిడి ద్వారా సృష్టించిన అగ్నితోనే యజ్ఞ యాగాదుల క్రతువులు నిర్వహించేవారు. ఇవాల్టికి దేశంలోని వివిధ ప్రాంతాల్లో శమీ వృక్షంలో అగ్ని ఉంటుందనే విశ్వాసం దృడపడింది. అగ్ని వీర్యమే సువర్ణం కనుక జమ్మి బంగారం కురిపించే చెట్టుగా పూజార్హత పొందింది. ఈ రోజే శ్రీ రాముడు రావణునిపై విజయం సాధించాడు. విజయదశమి రోజునే శమీ పూజ కుడా నిర్వహిస్తారు.

శ్రీరాముని వనవాస సమయంలో కుటీరం జమ్మి చెట్టు చెక్కతోనే నిర్మించారని చెబుతారు. శమి అంటే పాపాల్ని, శత్రువుల్ని నశింపజేసేది. పంచ పాండవులు అజ్ఞాత వాసానికి వెళ్ళే ముందు తమ ఆయుధాలని శమీ చెట్టుపై పెట్టడం జరిగింది. సామాన్యులే గాక యోగులు నవరాత్రులలో అమ్మవారిని పూజిస్తారు. ముఖ్యంగా శాక్తేయులు దీనిని ఆచరిస్తారు. ఆలయాలలో అమ్మవారికి విశేష అలంకరణలు, బొమ్మల కొలువు పెట్టడం ఒక ఆనవాయితీ. ఈ తొమ్మిది రోజులు ఒక్కో రోజు ఒక్కో అలంకారం చేసి, పూజిస్తారు. అమ్మవారు లోక కళ్యాణం కోసం ఒక్కోరోజు ఒక్కో అవతారం ధరించింది. అందువలన అలా అమ్మవారు అవతరించిన రోజున, ఆ రూపంతో అమ్మవారిని అలంకరించి ఆ నామంతో ఆరాధిస్తూ ఉంటారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# పౌష్టకాహారంతో ఎముకలకు పటుత్వం

## నేడు బోలు ఎముకల వ్యాధి దినం



ఆధునిక సమాజంలో ఎన్నో వ్యాధులు మానవుల మనుగడకు ప్రశ్నార్థకంగా మారాయి. బలవర్ధక మైన ఆహారం తీసుకోక పోవడంతో శరీరంలో శక్తి క్షీణించడమే కాకుండా, ఎముకల పటుత్వం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీని వల్ల అనేక సమస్యలు తలెత్తు తున్నాయి. ముఖ్యంగా అస్టియో పొరోసిస్ (బోలు ఎముకలు) వ్యాధి సంక్రమిస్తుంది. ఆహారపు అలవాట్లు, చెడు వ్యసనాల కారణంగా శరీరంలోని ఎముకలు పెళుసుగా మారి పలువురు ప్రమాదానికి లోనవు తున్నారు. ఎక్కువగా వృద్ధులకు వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం యువకుల్లోనూ కనిపిస్తున్నది. ప్రత్యేకించి మహిళల్లో ఈ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఒక్కోసారి ఈ వ్యాధి మరణానికి కూడా దారి తీస్తుంది. ఈ నేపథ్యంతో ఆస్టియో పొరోసిస్ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధిపై అవగాహన కలిగించేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతిఏటా అక్టోబరు 20వ తేదీన ప్రపంచ ఆస్టియో పొరోసిస్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిం చాలని తీర్మానించింది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఆధునిక పనిముట్లు అందుబాటు లోకి రావటంతో శారీరక శ్రమ తగ్గింది. దీనికితోడు బలవర్ధకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. వ్యాధిపై అవగాహన లేక పోవడంతో వ్యాధిగ్రస్థుల సంఖ్య నానాటికీ పెరుగు తున్నది. ఈ వ్యాధిపై ముందస్తు జాగ్రత్తలు లేకపోవడంతో కొందరు మంచానికే పరిమితం అవుతున్నారు. 80 శాతం మహిళలు, 20 శాతం పురుషుల్లో కనిపిస్తున్న ఈ బోలు వ్యాధి (ఆస్టియో పొరోసిస్) అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. గతంలో 50–60 ఏళ్లల్లో కనిపించే బోలు వ్యాధి ఇప్పుడు 30 ఏళ్ల వారిలోనూ ఉండటం గమనార్హం. వృద్ధుల్లో ప్రధాన సమస్యగా ఉన్న ఈ వ్యాధిపై అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. చిన్నతనం నుంచి కాల్షియంతో కూడిన ఆహార పదార్ధాలు తరచుగా తీసుకోవడం ద్వారా ఈ వ్యాధి నుంచి ఉపశ మనం పొందవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి ప్రభావం ఎక్కువగా మహిళల్లో వస్తుంది. 45 ఏళ్లు పైబడిన మహిళలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతున్నారు. విటమిన్ డీ లోపం, కాల్షియం తక్కువగా తీసుకోవడం, రుతు స్రావం తొందరగా ఆగిపోవడం, జన్యు పరమైన కారణాలు, రోగ నిర్ధారణ నియమాలు లేకపోవడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా వస్తుంది. థైరాయిడ్ కారణంగా కూడా దీని ప్రభావం ఎముకల సాంద్రతపై కూడా పడుతోంది. సూర్యరశ్మి తగలక పోవడం, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, విటమిన్ 'డి'కొరత, స్టెరాయిడ్స్ వాడటం తదితర కారణాలతో ఇది వస్తుంది. సూర్యకాంతిలో గడిపే సమయం తక్కువగా ఉండడంతో మహిళలు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా ఆస్టియో పొరోసిస్ వస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గతంలో లాగా శారీరక శ్రమ తగ్గింది. ఇందువల్ల గ్రామీణ ప్రాంతాల వారు కూడా ఈ వ్యాధికి ఎక్కువగా గురవు తున్నారు. ఉదర సంబంధమైన వ్యాధులు ఉన్న వారిలో బోలు వ్యాధి ఎక్కువగా కనిపిస్తుంది. సరైన పోషకాహారం తీసుకోక పోవడం, హైపో థైరాయి డిజం, హైపర్ థైరాయిడిజం, చిన్న వయసులోనే గర్భసంచి ఆపరేషన్ చేయించు కోవడం, కేన్సర్ చికిత్సలో భాగంగా కీమోథెరపి చేయించడం, బక్కపలుచగా ఉండటం, శారీరక శ్రమ లేక పోవడం, రొమటాయిడ్ ఆర్థరైటిస్ ఉన్న వారిలోనూ బోలు వ్యాధి కనిపిస్తుంది. బోలు వ్యాధి ఉంటే తుంటి ఎముక, వెన్నుపూస, మణికట్టులు చిన్నచిన్న దెబ్బలకే విరిగి పోతుంటాయి. గతుకుల రోడ్లలో వేగంగా వెళ్లడం, సడన్‌గా బ్రేక్ వేసినప్పుడు ఎముకలు విరిగి పోతుంటాయి. బోలు ఎముకలు వల్ల తీవ్రంగా నీరసం వస్తుంది. విరిగిన వెన్నుపూస, ఎముకల వల్ల తీవ్ర నొప్పి, పెరుగుదల తగ్గడం, శరీరం వంగిపోవడం, నడవలేని పరిస్థితి, మనిషి కదలిక మందగించడం తదితరాలు. ఎముకల పటిష్టతకు కాల్షియం ఉండే ఆహార పదార్ధాలతో పాటు మీగడ తీసిన పాలు, జున్ను తీసుకుంటే ఎంతో మేలు. ఉడక బెట్టిన బచ్చలికూర, బీన్స్, పచ్చి క్యాబేజీ, పచ్చి క్యారెట్, ఉడకబెట్టిన క్యాలీఫ్లవర్ తీసు కోవాలి. ఉడకబెట్టిన బెండ, బటానీలు, సోయాబీన్స్, ఉడక బెట్టిన పాలకూర, స్వీట్ పొటాటో తరచూ తీసుకోవాలి. ఖర్జూరం, కమలాలు, బొప్పాయి, బ్లాక్ బెర్రీలు తరచూ తీసుకోవాలి. బాదం పప్పు, ఎండబెట్టిన నువ్వులు, గుడ్లు తీసుకుంటే ఎముకల పటిష్టత పెరుగుతుంది. ప్రధానంగా జీవనశైలిలో తప్పనిసరిగా మార్పులు చేసుకోవాలి. వ్యాధిపై అవగాహన పెంచుకుని జాగ్రత్త పడాలి. వ్యాధికి గురి కాకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. యువతీ యువకులు మద్యపానం, ధూమ పానానికి దూరంగా ఉండాలి. తక్కువ కొవ్వు పదార్థాలు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. వ్యాధిగ్రస్థులు దృఢమైన ఎముకల కోసం, పగుళ్ల నివారణ కోసం కాల్షియం ఎక్కువగా ఉండే ఆహార పదార్ధాలు తీసుకోవాలి. తృణ ధాన్యాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి. ఎముకల సాంద్రత తగ్గిపోవడాన్ని నివారించే మందులు ప్రస్తుతం ఎన్నో అందుబాటులో ఉన్నాయి. ఈస్ట్రోజన్, హార్మోన్ చికిత్సలు కూడా ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఇంజక్షన్లతో పాటు మందులు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్లపైబడ్డ వారు తప్పనిసరిగా ఎముకల పరీక్ష చేయించు కోవాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్ధాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ఆహార నియమాలు తప్పని సరిగా పాటించాలి. వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. వ్యాధిపై అవగాహన పెంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి మహిళలు, వృద్ధులు ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకుంటే వ్యాధిని త్వరగా గుర్తించి, చికిత్స చేయించు కోవాలి.




రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు





# జాతీయ సెలక్షన్ కమిటీలో రమేశ్ పవార్

**సెలక్టర్‌గా మాజీ భారత స్పిన్నర్ నియామకం**

**కమిటీ చైర్మన్‌గా ప్రజ్ఞాన్ ఓజా కొనసాగింపు**

**2027 వన్డే ప్రపంచకప్ వరకు ప్రస్తుత కమిటీకి ప్రాధాన్యం**

బెంగళూరు: భారత పురుషుల సీనియర్ క్రికెట్ జాతీయ సెలక్షన్ కమిటీలో మాజీ స్పిన్నర్ రమేశ్ పవార్‌కు చోటు లభించింది. కమిటీ తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజా ఇకపై కూడా ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం ప్రకటించింది. గత చైర్మన్ అజిత్ అగార్కర్ పదవీకాలం అక్టోబర్ 4తో ముగియడంతో సెలక్షన్ కమిటీలో మార్పులు చేపట్టింది. రమేశ్ పవార్ నియామకాన్ని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ఏకగ్రీవంగా సిఫారసు చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మాజీ క్రికెటర్లు అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి నేతృత్వం వహిస్తారని సైకియా తెలిపారు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు కమిటీలో కొనసాగింపునకు ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం.

### ఆటగాడిగా, కోచ్‌గా గుర్తింపు

48 ఏళ్ల రమేశ్ పవార్ భారత్ తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబయి తరఫున ఆడిన ఆయన 148 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 470 వికెట్లు పడగొట్టడంతోపాటు 4,245 పరుగులు సాధించారు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన సమయంలో 2022 ఆసియా కప్ టైటిల్, కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ముంబయి, గుజరాత్ జట్లకు కోచ్‌గా వ్యవహరించడంతోపాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు.

### అగార్కర్ సేవలకు బీసీసీఐ ప్రశంసలు

కొత్త సెలక్టర్ ఎంపికలో భాగంగా అక్టోబర్ 15న ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో సలీల్ అంకోలా, వసీం జాఫర్, జాకబ్ మార్టిన్, కానర్ విలియమ్స్ కూడా పాల్గొన్నారు. చివరకు పవార్‌ను ఎంపిక చేశారు. 2023 జులైలో సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భారత క్రికెట్‌కు విశేష సేవలందించారని బీసీసీఐ ప్రశంసించింది. ఆయన పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు, వరుసగా రెండు ఆసియా క్రీడల స్వర్ణ పతకాలు సాధించినట్లు పేర్కొంది. సెలక్షన్ కమిటీ సభ్యులు: ప్రజ్ఞాన్ ఓజా (చైర్మన్), శివ్ సుందర్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, రమేశ్ పవార్.

# 27 స్థానాలు.. 146 మంది పోటీదారులు!

**మహిళల ప్రీమియర్ లీగ్ వేలానికి రంగం సిద్ధం**

**అక్టోబర్ 28న కొచ్చి వేదికగా ఆటగాళ్ల వేలం**

**కొచ్చి, అక్టోబర్ 19 :** ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్ ) 2027 సీజన్‌కు సంబంధించిన ఆటగాళ్ల వేలానికి రంగం సిద్ధమైంది. అక్టోబర్ 28న సాయంత్రం 5:30 గంటలకు కేరళలోని కొచ్చిలో ఈ వేలం జరగనున్నట్లు ఆఫీసియల్గా పేర్కొన్నారు. ఈ వేలంలో ఫ్రాంచైజీల వద్ద ఖాళీగా ఉన్న 27 స్థానాలకు మొత్తం 146 మంది ప్లేయర్లు బరిలో ఉన్నారు. ఈ జాబితాలో 119 మంది భారతీయ ప్లేయర్లు ఉన్నారు. వీరిలో 22 మంది క్యాప్డ్, 97 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు. భారతీయుల కోసం మొత్తం 20 స్థానాలు అందుబాటులో ఉన్నాయి. మరోవైపు 27 మంది విదేశీ ప్లేయర్లు వేలంలో పాల్గొంటున్నారు. వీరిలో 14 మంది క్యాప్డ్, 13 మంది అన్‌క్యాప్డ్ ప్లేయర్లు కాగా.. ఏడు విదేశీ ప్లేయర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. విదేశీ జాబితాలో అసోసియేట్ దేశాలకు చెందిన ఆరుగురు ప్లేయర్లు కూడా ఉన్నారు. వేలంలో పలువురు స్టార్ ప్లేయర్లు తమ బేస్ ప్రైస్‌ను రూ.50 లక్షలుగా నిర్ణయించుకున్నారు. సోఫియా డంక్లీ, సోఫీ మోలినెక్స్ అత్యధిక బేస్ ప్రైస్‌తో జాబితాలో ఉన్నారు. ఇక కమలిని, కిరణ్ నవ్‌గిరే, హీథర్ గ్రాహమ్, జెస్ జొనాసెన్ రూ.40 లక్షల బేస్ ప్రైస్‌తో వేలంలోకి రానున్నారు. మరో 30 మంది ప్లేయర్లు రూ.30 లక్షల బేస్ ప్రైస్‌ను ఎంచుకున్నారు. డబ్ల్యూపీఎల్ 2027 వేలం ఈ సైకిల్‌లో తొలి మినీ యాక్షన్ కానుంది. గతేడాది న్యూఢిల్లీలో జరిగిన మెగా వేలం తర్వాత ఫ్రాంచైజీలు తమ జట్లను పూర్తిగా పునర్వ్యవస్థీకరించుకున్నాయి. సెప్టెంబర్‌లోనే ఆయా జట్లు తమ రిటెన్షన్స్, రిలీజ్‌లను ఖరారు చేసుకుని మినీ వేలానికి సిద్ధమయ్యాయి. ఇప్పటివరకు ముంబైలో రెండు, బెంగళూరులో ఒకటి, న్యూఢిల్లీలో ఒకటి చొప్పున డబ్ల్యూపీఎల్ వేలాలు జరిగాయి. ఇప్పుడు 2027 వేలం కొచ్చి వేదికగా జరగనుంది.




# తొలి రోజే 11 పతకాలు

**ఆసియా పారా క్రీడల్లో అదరగొట్టిన భారత్**

**నాలుగు స్వర్ణాలు, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు**

- పతకాల పట్టికలో నాలుగో స్థానం
- ఆర్చరీలో శీతల్ దేవి ప్రపంచ రికార్డు సమం
- టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్‌లోనూ పతకాలపై ఆశలు



**నగోయా:** ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల వేటను ఘనంగా ప్రారంభించారు. పోటీల తొలి రోజైన సోమవారం నాలుగు స్వర్ణాలు, ఐదు రజతాలు, రెండు కాంస్యాలు కలిపి మొత్తం 11 పతకాలు సాధించారు. దీంతో పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంలో నిలిచింది. షూటింగ్, పారా అథ్లెటిక్స్, జూడో, స్విమ్మింగ్ విభాగాల్లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. ఆర్చరీలో శీతల్ దేవి వ్యక్తిగత విభాగంలో ప్రపంచ రికార్డును సమం చేయడంతోపాటు మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్1 ఫైనల్లో మోనా అగర్వాల్ 250.0 పాయింట్లతో ఆసియా పారా క్రీడల రికార్డు సృష్టించి స్వర్ణం గెలిచింది. ఆరో స్థానం నుంచి అద్భుతంగా పుంజుకున్న ఆమెను అధిగమించలేక రెండుసార్లు పారాలింపిక్స్ ఛాంపియన్ అవని లేఖరా 249.6 పాయింట్లతో రజతంతో సరిపెట్టుకుంది. ఈ ఫలితంతో 2028 లాస్‌ఏంజెలిస్ పారాలింపిక్స్ షూటింగ్ విభాగంలో భారత్‌కు రెండో కోటా స్థానం లభించింది.

### అథ్లెటిక్స్‌లో మూడు స్వర్ణాలు

పారా అథ్లెటిక్స్‌లో భారత క్రీడాకారులు మూడు స్వర్ణాలు సాధించారు. పారాలింపిక్స్‌లో రెండుసార్లు రజత పతకాలు గెలిచిన నిషాద్ కుమార్ తొలిసారి అంతర్జాతీయ లాంగ్‌జంప్ పోటీలో పాల్గొని 7.11 మీటర్ల దూకుడుతో పసిడి కైవసం చేసుకున్నాడు. మహిళల 1500 మీటర్ల టీ12/టీ13 విభాగంలో సౌమ్య 5 నిమిషాల 12.39 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో స్వర్ణం సాధించింది. ఇదే విభాగంలో భారత్‌కే చెందిన వెంకటేశ్ రాధా రజతం గెలిచింది. పురుషుల ఎఫ్46 జావెలిన్ త్రోలో రింకు 65.11 మీటర్ల దూరం విసిరి స్వర్ణం సాధించగా, అజీత్ సింగ్ 65.02 మీటర్ల ప్రదర్శనతో రజతం దక్కించుకున్నాడు. ఇద్దరూ ఈ సీజన్‌లో తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశారు. మహిళల టీ11 విభాగంలో రవన్నీ వలసనైనికి కాంస్య పతకం లభించింది.

### జూడోలో రజతం, కాంస్యం

దృష్టిలోపం ఉన్న క్రీడాకారుల జూడో పోటీల్లో భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. మహిళల జే2, 52 కిలోల విభాగంలో కోకిల రజతం గెలిచింది. ఫైనల్లో కిర్గిజిస్థాన్‌కు చెందిన ఐబికే ఉలాన్‌బెక్ కిజీ చేతిలో ఓడింది. పురుషుల జే1, 70 కిలోల విభాగంలో కపిల్ పర్మార్ కాంస్య పతకం సాధించాడు. సెమీఫైనల్లో ఓటమి ఎదురైనా, కాంస్య పతక పోరులో ఇండోనేషియాకు చెందిన అష్నాఫ్ రఫ్లీ షిద్కీపై 1-0తో విజయం సాధించాడు. పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 విభాగంలో రవి కార్తీక్ బుడిగిన 56.68 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రజత పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఇక టేబుల్ టెన్నిస్‌లో మూడు విభాగాల్లో భారత క్రీడాకారిణులు సెమీఫైనల్‌కు చేరి పతకాలను ఖాయం చేసుకున్నారు. మహిళల క్లాస్-6లో ప్రాచీ పాండే, క్లాస్-3లో సోనల్‌బెన్, క్లాస్-4/5లో భవినా పటేల్ సెమీస్‌కు అర్హత సాధించారు. ప్రాచీ థాయ్‌లాండ్‌కు చెందిన కనోక్‌పోర్న్ ఫాథుమ్‌చాయ్‌ను, సోనల్‌బెన్ దరారత్ అసయుట్‌ను ఓడించారు. భవినా చైనాకు చెందిన ఝూంగ్ మియావోపై 3-1తో విజయం సాధించింది.

### బ్యాడ్మింటన్‌లోనూ ముందంజ

మిక్స్‌డ్ డబుల్స్‌లో నితేశ్ కుమార్-తులసీమతి మురుగేశన్ జోడీ గ్రూప్-బిలో వరుస విజయాలతో అజేయంగా నిలిచి సెమీఫైనల్‌కు చేరింది. దీంతో ఈ విభాగంలోనూ భారత్‌కు పతకం ఖాయమైంది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 విభాగంలో పారాలింపిక్స్ ఛాంపియన్ నితేశ్ కుమార్ దక్షిణ కొరియాకు చెందిన జూ డోంగ్‌జేపై 21-13, 21-15తో గెలిచాడు. ఎస్‌యూ5 విభాగంలో రుతిక్ రఘుపతి థాయ్‌లాండ్‌కు చెందిన సోమ్‌సిరి ప్రిచాపై 21-12, 21-12తో విజయం సాధించాడు.

# భారత షట్లర్లకు సవాల్‌గా ఫ్రెంచ్ ఓపెన్

- నేటి నుంచి సూపర్ 750 టోర్నీ
- తొలి రౌండ్‌లో అగ్రశ్రేణి షట్లర్ అన్ సె యంగ్‌తో సింధు ఢీ
- లక్ష్యసేన్‌కు నరావోకాతో పోరు
- విజయాల బాట పట్టాలని సాత్విక్-చిరాగ్ జోడీ పట్టుదల





**పారిస్:** ఇటీవలి టోర్నీల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఫ్రెంచ్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సూపర్ 750 టోర్నీలో మొత్తం 9.5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ అందుబాటులో ఉంది. పీవీ సింధు సహా భారత షట్లర్లు తమ ఆటతీరును మెరుగుపరుచుకొని కీలక విజయాలు సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు.

### సింధుకు అన్ సె యంగ్ సవాల్

రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. దక్షిణ కొరియాకు చెందిన టాప్ సీడ్ అన్ సె యంగ్‌తో ఆమె తలపడనుంది. గత డెన్మార్క్ ఓపెన్‌లోనూ వీరిద్దరి మధ్య మ్యాచ్ ఖరారైనప్పటికీ, సీడెడ్ క్రీడాకారులు చివరి నిమిషంలో తప్పుకోవడంతో డ్రా మారింది. దీంతో సింధు జర్మనీకి చెందిన యెవోన్ లీతో ఆడాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో సింధు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. ఈసారి యంగ్‌ను ఎదుర్కొని ముందడుగు వేయాలంటే సింధు తన ప్రదర్శనను గణనీయంగా మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది.

### లక్ష్యసేన్‌కు పాత ప్రత్యర్థి

పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ లక్ష్యసేన్ జపాన్ ఆటగాడు కొడాయ్ నరావోకాతో తొలి రౌండ్‌లో తలపడనున్నాడు. వెన్నునొప్పి నుంచి కోలుకున్న లక్ష్యసేన్ ఆసియా క్రీడల్లో పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గతంలో నరావోకాపై విజయం సాధించిన అతడు మరోసారి అదే ప్రత్యర్థిని ఎదుర్కోనున్నాడు. మాజీ ప్రపంచ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ కూడా మెరుగైన ప్రదర్శనతో తిరిగి పుంజుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఇటీవల ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్‌కు గట్టి పోటీ ఇచ్చిన శ్రీకాంత్.. ఈసారి భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టితో తలపడనున్నాడు.

### సాత్విక్-చిరాగ్ జోడీపై ఆశలు

పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీపై అందరి దృష్టి నెలకొంది. ఈ ఏడాది సింగపూర్, చైనా టోర్నీల్లో టైటిళ్లు సాధించిన ఈ జంట ఆసియా క్రీడల్లో అనూహ్యంగా ముందుగానే నిష్క్రమించింది. ఈ నిరాశను అధిగమించి తిరిగి విజయాల బాట పట్టాలని భావిస్తోంది. తొలి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపోవ్, తోమా జూనియర్ పొపోవ్ సోదరులతో తలపడనుంది. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి కాంస్య పతకం సాధించిన మహిళల డబుల్స్ జోడీ త్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ కూడా బరిలోకి దిగనుంది. తైవాన్‌కు చెందిన లిన్ చిహ్-చున్, యాంగ్ చు-యున్ జోడీతో ఈ భారత జంట పోటీపడనుంది.

### మహిళల సింగిల్స్‌లో భారత పోరు

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత క్రీడాకారిణులు పలు కీలక మ్యాచ్‌లు ఆడనున్నారు. తన్వి శర్మ, ఇషారాణి బారువా పరస్పరం తలపడనుండగా, అశ్మిత చలిహా చైనాకు చెందిన హాన్ కియాన్ షితో పోటీపడనుంది. ఉన్నతి హూడా జపాన్ క్రీడాకారిణి రికో గుంజీని ఎదుర్కోనుంది. దేవికా సిహాగ్‌కు ఇండోనేషియాకు చెందిన ఐదో సీడ్ పుత్రి కుసుమ వార్దానీ ప్రత్యర్థిగా నిలవనుంది.

# సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ

**హిమాచల్‌పై ముంబై 258 పరుగుల ఆధిక్యం**

**నిషాంత్ సింధు ఆల్‌రౌండ్ షో.. రెండు రోజుల్లోనే హర్యానా ఘన విజయం**

**బిలాస్‌పూర్/రోహ్‌తక్:** రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌ల్లో ముంబై, హర్యానా జట్లు సత్తాచాటాయి. హిమాచల్‌ప్రదేశ్‌పై ముంబై భారీ ఆధిక్యంతో దూసుకెళ్తుండగా.. చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హర్యానా ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలగా.. ముంబై రెండో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 398 పరుగులు చేసింది. సర్ఫరాజ్ ఖాన్ 213 బంతుల్లో 18 ఫోర్లతో 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆకాష్ ఆనంద్ 58 పరుగులతో అతడికి అండగా నిలిచాడు. ఐదో వికెట్‌కు వీరిద్దరూ అజేయంగా 176 పరుగులు జోడించారు. దీంతో ముంబయికి 258 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 12 పరుగులతో ఆట కొనసాగించిన కెప్టెన్ సిద్ధేశ్ లాడ్ 87 పరుగులు చేసి ఔటయ్యాడు. ముషీర్ ఖాన్ 57 పరుగులు సాధించాడు. సోమవారం ముంబయి 87 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 291 పరుగులు జోడించింది. హిమాచల్ బౌలర్లలో అభిషేక్ కుమార్, జితేందర్ రాణా రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తుషార్ దేశ్‌పాండే నాలుగు వికెట్లతో హిమాచల్‌ను దెబ్బతీశాడు.

### సింధు ఆల్‌రౌండ్ ప్రదర్శన

రోహ్‌తక్‌లో చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత చండీగఢ్ 103 పరుగులకు ఆలౌటైంది. అనంతరం హర్యానా తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. నిషాంత్ సింధు 92, యశ్‌వర్ధన్ దలాల్ 95 పరుగులతో రాణించారు. దీంతో హర్యానాకు 142 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో చండీగఢ్ 118 పరుగులకే పరిమితమైంది. ఎడమచేతి వాటం స్పిన్నర్ నిషాంత్ సింధు 27 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కనిష్క్ చౌహాన్ మూడు వికెట్లు తీశాడు. చండీగఢ్ కెప్టెన్ మన్‌దీప్ వోహ్రా 47 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. ప్రదోష్ రంజన్ పాల్ 136, బాబా ఇంద్రజిత్ 77 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకు ఆలౌటై, రెండో ఇన్నింగ్స్‌లో ఏడు ఓవర్లకు వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. మయాంక్ మిశ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు.



జైపూర్‌లో రాజస్థాన్ 497 పరుగుల భారీ స్కోరు సాధించింది. సచిన్ యాదవ్, కరణ్ లాంబా చెరో 194 పరుగులు చేశారు. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్‌కు 46 పరుగులు చేసింది.

# నన్నే ఎందుకు టార్గెట్ చేశారు?



కాల్పుల ఘటనతో బాలీవుడ్‌లో కలకలం

**ముంబై, అక్టోబర్ 19 :** బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌ను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగినట్లు వెలువడిన వార్తలు సినీ పరిశ్రమలో కలకలం రేపుతున్నాయి. తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో అర్థం కావడం లేదని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని టైగర్ ష్రాఫ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండేతో జరిగిన సమావేశంలో ఆయన ఈ విషయాలను వెల్లడించినట్లు సమాచారం. గతంలో తనకు ఎలాంటి బెదిరింపులు రాలేదని, ఎవరితోనూ వ్యక్తిగత వివాదాలు లేవని చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాల్పుల ఘటన నేపథ్యంలో తనను లక్ష్యంగా చేసుకోవాల్సిన అవసరం ఎవరికుందో తెలియడం లేదని టైగర్ ష్రాఫ్ పేర్కొన్నట్లు సమాచారం. తనకు గతంలో ఎలాంటి బెదిరింపు సందేశాలు అందలేదని, ఎవరితోనూ శత్రుత్వం లేదని శిండేకు వివరించినట్లు జాతీయ మీడియా వెల్లడించింది. లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో గానీ, నటుడు సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన వివాదాలతో గానీ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ పరిస్థితుల్లో తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారన్న విషయం అర్థం కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. సాధారణంగా వారాంతాల్లో ఫుట్‌బాల్ ఆడిన అనంతరం అభిమానులతో ఫొటోలు దిగడం టైగర్ ష్రాఫ్‌కు అలవాటని కథనాలు పేర్కొన్నాయి. అయితే ఆదివారం ఫుట్‌బాల్ ఆడిన తర్వాత అలసటగా అనిపించడంతో అభిమానులతో ఫొటోలు దిగకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఆ రోజు తీసుకున్న నిర్ణయం తనను ప్రమాదం నుంచి తప్పించి ఉండవచ్చని శిండేతో చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ అంశానికి కాల్పుల ఘటనతో ఉన్న సంబంధంపై అధికారిక దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది. కాల్పుల ఘటన అనంతరం ఆదివారం రాత్రి టైగర్ ష్రాఫ్‌ను మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే పరామర్శించినట్లు కథనాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా నటుడితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నట్లు సమాచారం. టైగర్ ష్రాఫ్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని శిండే హామీ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. భద్రత విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నాయి. టైగర్ ష్రాఫ్ భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం. ఆయనకు వ్యక్తిగత భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు నివాసం వద్ద పోలీసు బందోబస్తును పెంచే విషయంపై చర్యలు తీసుకోనున్నట్లు శిండే వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. కాల్పుల ఘటనకు సంబంధించి అనుమానితులను రాజస్థాన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే నిందితుల వివరాలు, ఘటన వెనుక కారణాలు, దర్యాప్తులో వెల్లడైన అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. కాల్పులకు పాల్పడిన వారి ఉద్దేశం ఏమిటి? టైగర్ ష్రాఫ్‌ను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? ఈ ఘటన వెనుక ఏదైనా ముఠా ప్రమేయం ఉందా? అనే ప్రశ్నలకు దర్యాప్తులో సమాధానాలు లభించాల్సి ఉంది.



# కీర్తి సురేష్ సినిమాపై మహేష్ బాబు ఫ్యాన్స్ ఫైర్..

పెళ్లి తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్, ఇప్పుడు గేర్ మార్చి వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. కేవలం రెగ్యులర్ హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, మొన్నటికి మొన్న నాని 'ది ప్యారడైజ్'లో స్పెషల్ సాంగ్‌తో దుమ్ములేపిన ఈ ముద్దుగుమ్మ, అటు 'దోరతీ'లో కాసేపే కనిపించినా ఇంపాక్ట్ చూపించింది. ఇక త్వరలోనే 'అక్క' అనే వెబ్ సిరీస్‌లో నెవర్ బిఫోర్ లేడీ గ్యాంగ్‌స్టర్ అవతారంలో అక్టోబర్ 30న నెట్‌ఫ్లిక్స్‌లో పలకరించబోతోంది. అయితే ఇవన్నీ ఒకెత్తయితే.. నవంబర్ 20న థియేటర్లలోకి రాబోతున్న ఆమె తాజా చిత్రం 'సత్యవాన్ సావిత్రి' చుట్టూ ఇప్పుడు టాలీవుడ్‌లో ఓ సరికొత్త వివాదం రాజుకుంది. ఈ సినిమా టీజర్ బయటకు వచ్చాక సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయం ఏంటంటే.. సినిమా జులైలోనే రావాల్సి ఉండగా నవంబర్‌కు వాయిదా పడింది. ఈ లేట్ రిలీజ్‌పై వచ్చే ట్రోల్స్‌కు కౌంటర్ ఇచ్చేలా టీజర్‌లో పోకిరి సినిమాలోని ఫేమస్ డైలాగ్ "ఎప్పుడు వచ్చామన్నది కాదన్నయ్యా.. బుల్లెట్ దిగిందా లేదా!" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌ను తెలుగు టీజర్‌లో వాడారు. అయితే మాట మహేష్ బాబుది పెట్టి, విజువల్స్‌లో మాత్రం కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ సీన్‌ను చూపించడం మనోళ్లకు ఏమాత్రం మింగుడుపడటం లేదు. మాట ఆయనది వాడినప్పుడు మహేష్‌ను ఎందుకు చూపించలేదంటూ సోషల్ మీడియాలో మహేష్ ఫ్యాన్స్ మేకర్స్‌పై గుర్రుమంటున్నారు. టైటిల్‌తో పాటు సినిమా మొత్తం తమిళ వాసనలే ఎక్కువగా కనిపిస్తున్నాయన్న విమర్శలూ వస్తున్నాయి. దర్శకుడు మిస్కిన్ కీలక పాత్రలో, కీర్తి సురేష్ లాయర్‌గా నటిస్తున్న ఈ కోర్ట్ రూమ్ డ్రామాకు బాక్సాఫీస్ వద్ద అంత ఈజీగా దారి దొరికేలా లేదు. నవంబర్ 20న అటు తెలుగు, ఇటు తమిళంలో ఇద్దరు క్రేజీ హీరోలతో కీర్తి నేరుగా తలపడాల్సి వస్తోంది. ధనుష్ నటిస్తున్న 'ఓం', దుల్కర్ సల్మాన్ నటిస్తున్న 'ఆకాశంలో ఒక తార' చిత్రాలు కూడా సరిగ్గా అదే రోజున థియేటర్లలోకి దిగుతున్నాయి. అటు కోలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో ఈ ఇద్దరు స్టార్ల చిత్రాల నుంచి భారీ పోటీని తట్టుకుని కీర్తి సురేష్ తన 'సావిత్రి'తో ఏ మేరకు విజయం సాధిస్తుందో చూడాలి.

# భక్తి విశ్వాసాల కనకదుర్గ



అల్లరి నరేశ్, కాజల్ చౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త సినిమా 'కనకదుర్గ'. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. బిర్లా స్టూడియోస్, టెంపుల్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి నిర్మిస్తున్నారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఈ చిత్రం నుంచి తొలి పాట 'అమ్మ కనకదుర్గ'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను తమన్ స్వరపర్చగా, సిరాశ్రీ సాహిత్యం అందించారు. ఈ గీతావిష్కరణ కార్యక్రమంలో హీరో అల్లరి నరేశ్ మాట్లాడుతూ.. "నేను తొలిసారి ఈ భక్తిరస చిత్రంలో నటిస్తున్నా. సినిమా షూటింగ్ పూర్తయింది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సిద్ధం చేస్తున్నాం" అన్నారు. నిర్మాతలు అజిత్ ఠాకూర్, బీవీఎస్ రవి మాట్లాడుతూ.. "భక్తి విశ్వాసాల నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ కథను ప్రేక్షకుల ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పాట విడుదల ఒక అర్థవంతమైన తొలి అడుగు" అని చెప్పారు. సంగీత దర్శకుడు తమన్ మాట్లాడుతూ.. "ఈ పాట కేవలం ఓ సంగీత రచనలా కాకుండా.. భక్తుడు అమ్మవారిని ప్రార్థించే సమయంలో కలిగే గాఢమైన భావోద్వేగాన్ని, అమ్మవారి అపారమైన శక్తిని, కరుణను ప్రతిబింబించేలా ఉండాలని కోరుకున్నా" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిర్లా స్టూడియోస్ సహ నిర్మాత సునీల్ చైనాని, జీ మ్యూజిక్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సుజల్ పరేఖ్ పాల్గొన్నారు.



# గులాబీ లెహంగాలో గ్లామరస్‌గా

టాలీవుడ్ అందాల భామ హెబ్బా పటేల్ గులాబీ వర్ణపు లెహంగాలో అత్యంత గ్లామరస్‌గా మెరిసిపోయారు. ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్స్‌తో అలరించే ఈ బ్యూటీ, నవరాత్రుల శుభసమర్భంలో సంప్రదాయ దుస్తులు ధరించి తనదైన స్టైలిష్ గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్నారు. ఆమె షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. 'కుమారి 21ఫ్' చిత్రంతో యూత్‌లో తిరుగులేని క్రేజ్ సంపాదించుకున్న హెబ్బా పటేల్, ఈ ఫోటోషూట్‌లో పింక్ కలర్ డిజైనర్ లెహంగాలో ఎంతో అందంగా కనిపించారు. బ్లౌజ్‌పై ఉన్న గోల్డెన్ వర్క్, చేతుల డిజైన్లు డ్రెస్‌కు ప్రత్యేక ఆకర్షణ తెచ్చిపెట్టగా, పెద్ద చెవిపోగులు, పాపిట బిళ్ల, గాజులు ఆమె గ్లామరస్ లుక్‌కు మరింత శోభను చేకూర్చాయి. ఎరుపు రంగు బ్యాక్‌డ్రాప్‌లో ఆమె ఇచ్చిన ప్రత్యేక పోజులు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సాధారణంగా పండుగల సమయంలో హీరోయిన్లు సంప్రదాయ కట్టుబొట్టులో కనిపించడం సహజమే అయినప్పటికీ, హెబ్బా పటేల్ సంప్రదాయాన్ని పాటిస్తూనే ఎంతో గ్లామరస్‌గా కనిపించడం విశేషం. దీంతో ఆమె ఫోటోలపై అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'ఈడో రకం ఆడో రకం', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'అంధగాడు' వంటి హిట్ చిత్రాల్లో నటించిన హెబ్బా, త్వరలోనే 'రుద్ర కాల', 'రామరస' వంటి ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. పండుగ వేళ హెబ్బా పటేల్ పంచుకున్న ఈ గ్లామరస్ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

# మాధురి రాథోడ్.. మళ్లీ దుమ్ము దులిపేసిందిగా




ఇటీవల వరుస వివాదాలతో టాక్ ఆఫ్ ది మీడియాగా నిలిచిన ప్రముఖ ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. అయితే ఈ సారి వైరల్ న్యూస్‌తో కాదు. తాను నూతనంగా నర్తించిన జానపద గీతం భామ సుందరాలో తాజాగా యూ ట్యూబ్‌లో విడుదలై విజయవంతంగా దూసుకెళుతుంది. అయితే ఈ పాటలో తరుచూ కనిపించే తన ప్రియుడు సాయితో కాకుండా వెంకట్ అజ్మీరాతో కలిసి ఆడి పాడింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రిలీజ్ అయిన ఈ పాట కొద్ది సమయంలోనే మిలియన్‌కు పైగా వ్యూస్ రాబట్టి యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. దివంగత రామస్వామి సాహిత్యం అందించిన ఈ గేయానికి నటుడు వెంకట్ అజ్మీరానే స్వయంగా సంగీతం అందించగా శేఖర్ వైరస్ నృత్యరీతులు సమకూర్చాడు. నరసింహులు, ముకుంద ఆలపించారు. పాటలోని సాహిత్యానికి తోడు మాధురి డ్యాన్స్ ఈ పాటకు ‌ప్రదాన ఆకరణగా నిలిచింది. ఇంకెందుకు ఆలసం మీరూ ఈ పాటపె ఓ లుక్ వేయండి.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com